ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 2 మార్చి 2025



రేపటి నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షలను 3,580 మంది రాయనున్నట్లు తెలిపారు. 200 మంది ఇన్విజిలేటర్స్, 20 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 10 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే 8341408109కు ఫోన్ చేయాలని కోరారు.

విజయోభవ..



అర్చకుడికి హాల్‌టికెట్లు ఇచ్చి దీవెనలు అందుకుంటున్న విద్యార్థులు

● ఇదిగో ఇక్కడుంది నా నెంబర్!



పరీక్ష కేంద్రంలో గదులను పరిశీలించుకుంటున్న విద్యార్థులు



వీటికి నో ఎంట్రీ!

నెల్లూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



ఏలోటూ రానీయొద్దు

పోలీస్‌స్టేషన్ వద్ద అధికారులకు ఆర్ఐవో శ్రీనివాసులు సూచనలు

ఇంటర్ పరీక్షల ప్రారంభం

28,098 మంది విద్యార్థుల హాజరు

తొలిరోజు ప్రశాంతంగా..

టైం అయిపోతోంది.. త్వరగా బయలుదేరుదాం!
- ఇంటి వద్ద హడావుడి

పరీక్షలు బాగా రాసేలా దీవించు దేవా..
- ఆలయాల్లో విద్యార్థుల మొక్కులు

నాయనా.. టెన్షన్ పడొద్దు. కొశ్చన్ పేపరు ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకుని సమాధానాలు రాయి. టైం ఉంటే చాయిస్‌ను కూడా వదలొద్దు!
- పిల్లలకు తల్లిదండ్రుల హితబోధ

అమ్మా.. బాగా రాశానమ్మా! చదివినవన్నీ వచ్చాయి!
- పరీక్షల అనంతరం విద్యార్థుల ఆనందం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ ద్వితీయభాష (తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ) పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు నిమిషం ఆలస్యమైన అనుమతి లేదన్న నిబంధన అమలు చేశారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాష్ట్ర కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయం ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా అధికారులు పరిశీలించారు. తొలి రోజు కావడంతో విద్యా ర్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందుగానే చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. కేంద్రాల బయటనే హాల్‌టికెట్లు పరిశీలించిన అనంతరం విద్యార్థుల వద్ద ఉన్న ఇతర గాడ్జెట్స్‌ను లోనికి అనుమతించలేదు. తల్లిదండ్రులు మాత్రం పరీక్ష కేంద్రాల వద్దనే మూడు గంటలపాటు ఎదురు చూశారు.



ఎలా రాస్తున్నారో ఏమో!?
పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

● 914 మంది గైర్హాజరు

ఇంటర్ పరీక్షల్లో తొలిరోజున 29,102 మందికి 28,098 మంది విద్యార్థులు హాజరయ్యారు. 914 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించగా డీవీఈఓ నాలుగింటిని, డీఈసీ సభ్యులు ఏడింటిని, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 26 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అధికారులు తెలిపారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఆల్ ది బెస్ట్ : సీతారామపురంలో విద్యార్థులకు సూచనలిస్తూ...



వ్యాఘ్రంపై ముక్కంటి వైభోగం

నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడు పులి వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం పాలభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

చాంద్‌రాత్ ముబారక్

● కనిపించిన నెలవంక.. మురిసిన ముస్లింలు
● నేటి నుంచి రంజాన్ నెల



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : 6.19
సహరి (సోమవారం) : 5.05

నెల్లూరు (సాంస్కృతికం)/ పొదలకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ముస్లింల పవిత్ర మాసం. శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. దీంతో నగరంలోని పలు కూడళ్లలో ముస్లింలు 'చాంద్‌రాత్ ముబారక్' అంటూ కేరింతలు కొట్టారు. ఒకరినొకరు ఆలింగనంలు చేసుకుంటూ అభినందనలు తెలుపుకున్నారు. జెండావీధి, తూకుమాన్‌మిట్ట, మహాత్మాగాంధీ నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, నవాబుపేట, తదితర సెంటర్లలో యువత బాణాసంచా పేల్చి రంజాన్ మాసానికి స్వాగతం పలికారు. నియమ నిష్టలు, క్రమశిక్షణ, దాన ధర్మాలు నిర్వహించే రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 30వ తేదీ వరకు నిర్విఘ్నంగా సాగేలా చూడమని మహమ్మద్ ప్రవక్తను తారావి ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం 5.05 గంటలకు సహరి స్వీకరించి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. సాయంత్రం 6.18గంటలకు దువా ప్రార్థనలు చేసి ఇఫ్తార్ స్వీకరించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఇలా ప్రతిరోజు సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత వరకు ఉపవాస దీక్షలు కొనసాగిస్తారు. రంజాన్ ఉపవాస దీక్షలు విజయవంతం కావా లని ఆకాంక్షిస్తూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, శాసనసభ్యులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.



నటి అనుపమ సందడి

నెల్లూరు (సాంస్కృతికం) : సినీ నటి అనుపమ పరమేశ్వరన్ శనివారం నెల్లూరులో సందడి చేశారు. మినీ బైపాస్‌లో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. వారికి అనుపమ అభివాదం చేసి సెల్ఫీలు దిగారు. భారీగా అభిమానులు రావడంతో వారిని నియంత్రించేందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారు.

● రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల తీరిది
● అయ్యవారిపల్లి అటవీ భూముల్లో పొంతనలేని కొలతలు
● ఆక్రమణదారులకు స్వర్గధామంగా మారిన వైనం
● రూ.కోట్లు విలువైన భూముల ఆక్రమణ

కాసింత స్థలం కనిపిస్తే చాలు.. తమదంటే తమదని పోట్లాడుకునే వాళ్లను చూశాం. ప్రభుత్వ శాఖల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుంటాయి. కానీ అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల తీరు మాత్రం విచిత్రంగా ఉంటోంది. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లిలో విలువైన భూములు తమవి కాదంటూ తమవి కాదంటూ ఆక్రమణదారులకు స్వర్గధామంగా మార్చేస్తున్నారు. అంతేకాదండోయ్.. కబ్జారాయుళ్లు ఇచ్చే మామూళ్లకు దాసోహమై రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. భూ కొలతలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చెందిన నేటికాలంలో కూడా రమారమి 6500 ఎకరాలకు హక్కుదారులే లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వేరే చెప్పాల్సిన పనిలేదు.



అయ్యవారిపల్లి సమీపంలో ఉన్న కొండ భూములు

ఆ భూమి మాది కాదు..

అబ్బే మాదీ కాదు!

కందుకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ పుణ్యక్షేత్రం చెంతనే ఉండే అయ్యవారిపల్లి పరిధిలో పలు కొండలు, గుట్టలతో కూడిన అటవీ భూములు ఉన్నాయి. అటవీ శాఖ రికార్డులు, రెవెన్యూ ఫీల్డ్ లెవల్ రిజిస్టర్ (ఎఫ్ఎల్ఆర్) ప్రకారం సర్వే నెం.4లో 72 ఎకరాలు, మరో సర్వే నెం.118లో 1584 ఎకరాల అటవీ భూమి ఉంది. అయితే ఈ రెండు సర్వే నెంబర్ల ఫీల్డ్ మెజర్‌మెంట్ మ్యాప్ బుక్ (ఎఫ్ఎంబీ)లు పరిశీలిస్తే ఎఫ్ఎల్ఆర్‌లో చూయించిన విస్తీర్ణానికి, వాస్తవ కొలతలకు పొంతనే లేదు. ఎఫ్ఎంబీ కొలతల ప్రకారం సర్వే నెం.118లో 5,603 ఎకరాలు ఉండగా, సర్వే నెం.4లో 2,552 ఎకరాల భూమి ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లలో చదునుగా ఉండే భూమితోపాటు కొండలు, గుట్టలు కూడా ఉన్నాయి. ఈ రెండు సర్వే నెంబర్లను కొండలు, గుట్టలతో సహా అటవీ శాఖకు కేటాయించారు. అంటే మొత్తం భూమి 8155 ఎకరాలు ఉండగా అటవీ శాఖకు రికార్డుప్రకారం కేటాయించింది 1656 ఎకరాలు మాత్రమే. అటవీ శాఖ అధికారులు కూడా తమకు కేటాయించిన విస్తీర్ణాన్ని బట్టి 1,656 ఎకరాలకు మాత్రమే తమదని చెబుతున్నారు. దీంతో మిగిలిన 6,499 ఎకరాలకు హక్కుదారులు ఎవరనేది లేకుండా పోయింది. ఆర్ఎస్ఆర్, ఇతరత్రా భూ రికార్డులు పరిశీలించినా ఆ రెండు సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణం ఎఫ్ఎంబీకి అనుగుణంగా ఉండటమేగాక ఈ రెండు సర్వే నెంబర్లలో ఎలాంటి ప్రైవేటు పట్టాదారులు లేరు. సాధారణంగా ఒక సర్వే నెంబరులో కొంత భూమిని అటవీశాఖకు కేటాయించి ఆ సర్వే నెంబరులో పట్టాదారులెవరూ లేనప్పుడు మిగిలిన విస్తీర్ణం రెవిన్యూశాఖ అధీనంలో ఉండాలి. కానీ ఇక్కడ అదేమీ జరగకపోవటం ఆ రెండు సర్వేనెంబర్ల మొత్తం విస్తీర్ణం 1656 ఎకరాలు మాత్రమే అన్నట్లుగా భూరికార్డులు తయారుకావటంతో వేల ఎకరాలకు హక్కుదారులేకుండా పోయారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

ఈ భూముల్లో విలువైన ఖనిజ నిక్షేపాలు, వృక్ష సంపద ఉండటం, 167బీ జాతీయ రహదారి వెళ్తుండటంతో ఈ భూముల విలువ రూ.వందల కోట్లకు పెరిగిపోయింది. గ్రావెల్, మట్టికి కూడా మంచి డిమాండ్ ఏర్పడటంతో ఎవరి ఇష్టానుసారం వారు ఆక్రమించేస్తున్నారు. ఇటుకల బట్టీల నిర్వహణ కోసం కొందరు, మట్టి తవ్వకాల కోసం కొందరు ఈ భూములను ఆక్రమించేసి సొమ్ము చేసుకుంటున్నారు. హైవే నిర్మాణ కాంట్రాక్టరు కూడా ఈ భూముల్లోనే పెద్దఎత్తున గ్రావెల్ ఎత్తుకుని రహదారి నిర్మాణానికి వినియోగించుకున్నట్లు సమాచారం. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆక్రమణలకు తెరలేపడం, ఈ వ్యవహారంపై పలువురు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు ఫిర్యాదుచేయటంతో రెవెన్యూ, అటవీ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఆక్రమిత భూమి ఏ శాఖకు చెందుతుందో తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే సర్వే చేశారు కానీ ఎవరికి వారే ఆ భూమి తమది కాదంటే తమదికాదని సబ్ కలెక్టరుకు నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సర్వే సందర్భంగా ఎఫ్ఎంబీలోని కొలతకు, ఎఫ్ఎల్ఆర్‌లోని కొలతలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన అధికారుల ద్వారా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 6,499 ఎకరాల విస్తీర్ణం వ్యత్యాసం ఉందని అర్థమవుతున్నా ఇంత భారీవ్యత్యాసంతో రికార్డులు ఎలా రూపొందాయో అర్థం కాక తలపట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు దృష్టిసారించి సమగ్ర సర్వే ద్వారా భూ రికార్డులు పక్కాగా రూపొందించి వందల కోట్ల విలువైన వేల ఎకరాల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అయ్యవారిపల్లి దగ్గర నిర్మించిన అటవీశాఖ క్వార్టర్స్ చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోయి శిథిలాస్థితికి చేరుతున్న దృశ్యం

సర్వేచేసి హద్దులు నిర్ణయించాలి

అయ్యవారిపల్లి రెవెన్యూలో సర్వే నెంబర్లు 118, 4లలో ఉన్న భూ సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ సర్వే నెంబర్లలో కొంత భూమి అటవీ శాఖకు కేటాయించి ఉండగా మిగిలినది రెవెన్యూ భూమిగా ఉంది. అయితే ఎవరి భూమి ఎక్కడివరకు అనే విషయంలో స్పష్టత లేదు. జాయింట్ సర్వేచేసి హద్దులు నిర్ణయిస్తే మొత్తం విస్తీర్ణం ఎంత, అటవీశాఖకు పోను రెవెన్యూ శాఖకు మిగులుతుంతో తేలిపోతుంది. రికార్డులు లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- అబ్దుల్ హమీద్, తహసీల్దారు, వలేటివారిపాలెం

హెల్మెట్ ధరించకుంటే వెయ్యి..
డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు

● అమలులోకి కేంద్ర మోటారు వెహికల్ చట్టం

కొత్త జరిమానాలు	రూ.లలో
హెల్మెట్ ధరించకుంటే	1000
డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే	5000
ఇన్సూరెన్స్ లేకుంటే	
మొదటిసారి	2000
రెండవ సారి నుంచి	1500
సైలెన్సర్ మార్చితే	1500
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1500
డేంజర్ డ్రైవింగ్	10,000
సీటు బెల్ట్ లేకుంటే	1000
రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్,	
రెన్యువల్ లేకుంటే	2000
రెండవసారి	10,000
ఓవర్ స్పీడ్	1000
ట్రిపిల్ రైడింగ్	1000

నెల్లూరు (క్రైం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మోటారు వెహికల్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఇక జేబుకు చిల్లే. కేంద్రం రూపొందించిన చట్టంలోని కొత్త మార్గదర్శకాలు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. ఆ నిబంధనల ప్రకారం హెల్మెట్ ధరించకపోయినా.. సీటు బెల్టు పెట్టుకోకపోయినా.. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా వెయ్యి రూపాయలకుపైనే జరిమానా విధించనున్నారు. ఈమేరకు పోలీస్ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. రోడ్డు భద్రతా నాయమాలు అనుసరించి వాహనాలు నడుపుతూ గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ ప్రజలకు సూచించారు. లైసెన్స్, హెల్మెట్, రిజిస్ట్రేషన్, బీమా డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, సీట్ బెల్టు ధరించడం, మద్యం తాగి వాహనాలు నడపడం చేయకూడదని పేర్కొన్నారు. కొత్త చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించేందుకు 50 శాతం రాయితీ ప్రకటించినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక కిలో వాట్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు రూ.2వేలు ఉండగా 50 శాతం రాయితీ పోను రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో 6,75,535 మంది గృహ వినియోగదారులు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది గతంలో తక్కువ లోడ్‌తో మీటర్లు పొంది ప్రస్తుతం ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అటువంటి వారంతా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. మార్చి 1 నుంచి జూన్ 30 వరకు స్థానిక విద్యుత్ కార్యాలయాల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలకు

తీవ్ర అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంప్రసాద్

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మాదాల శ్యాంప్రసాద్ అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం వెనుకబడిన ప్రాంతాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష వైఖరి తెలుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులైన వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్‌కు కనీస నిధులు కేటాయించి బడ్జెట్‌లో అవసరమైన సరవణలు చేయాలన్నారు. అలా చేయకపోతే వేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణయ్య, సామాజిక విశ్లేషకులు బసిరెడ్డి మాలకొండయ్య, రైతు పోరాటయోధ నాయకులు ఆదినారాయణ, చిరంజీవి, రాఘవ, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ఆగిన జల్‌జీవన్ పనులు

● తాగునీటి కోసం ప్రజల అవస్థలు

మర్రిపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలని గత వైసీపీ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా నీటి వనరులను గుర్తించకుండా జల్‌జీవన్ మిషన్ పేరుతో ప్రారంభించిన పనులు మండలంలో పలుచోట్ల అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఆ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. భూమిలో పైపులైన్లు వేసి ప్రతీ ఇంటికి కుళాయిలు ఏర్పాటుచేసి నీటిపథకానికి అనుసంధానం చేయాలి. కానీ ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఈపథకంపై ఆశలు పెట్టుకున్న మెట్ట ప్రాంత గ్రామాల ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. వేసవి కాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో ప్రస్తుతం నీరు అడుగంటిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కూటమి ప్రభుత్వంతో పనుల్లో పురోగతి

మండలంలో ఏపిలగుంట, బ్రాహ్మణపల్లి, పొంగూరు, కంద్రిక, చుంచులూరు గ్రామాల్లో సుమారు రూ. 90లక్షలకు సంబంధించిన పనులు ఏడాదిన్నర క్రితం అర్ధాంతరంగా ఆగిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రారంభంకాని పనులను రద్దుచేసి, ముందుగా పురోగతిలో ఉన్న పనులన్నింటినీ పూర్తిచేయాలని ఆదేశించింది. గుత్తేదారులకు అగ్రిమెంట్ సమయం ముగిసినప్పటికీ కాలపరిమితి పొడిగించింది. అంతేగాక ప్రస్తుతం వాటర్‌గ్రిడ్ పేరుతో సోమశిల జలాలను అన్ని గ్రామాలకు తాగునీరుగా అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.



ఏపిలగుంటలో నిరుపయోగంగా ఉన్న పైపులు

నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

పొదలకూరు శ్మశానంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ



అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

పొదలకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న శ్మశానంలో గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని గమనించి న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముందుగా సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఎండీ.హనీఫ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకుని సమాధుల మధ్య రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. కాగా రంగంలోకి దిగిన క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లు వేలి ముద్రలు, వివరాలు సేకరిస్తున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మృతదేహం తలపై కోసిన ట్లు గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తుమన్నారు. హంతకులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదల మన్నారు.

మనుబోలు రైల్వే స్టేషన్ వద్ద యాచకుడు..



రైల్వే స్టేషన్ సమీపంలో యువకుడి మృతదేహం

మనుబోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఓ గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెంది ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. అది తమ పరిధి కాదని రైల్వే పోలీసులు చెప్పడంతో సివిల్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతుడు నీలంరంగు జీన్స్‌ప్యాంటు, నల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడు. అతని పక్కన ఓ మూట ఉంది. చింపిరి జుట్టు, అపరిశుభ్రంగా ఉండడంతో యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం తీరునుబట్టి ఫిట్స్ వచ్చి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంగపట్నం రోడ్డులో వ్యక్తి మృతదేహం



పురిణి వెంకటరమణయ్య మృతదేహం

ఇందుకూరుపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడు- గంగపట్నం రోడ్డులో మెకానిక్ షాప్ దగ్గర శనివారం పల్లెపాలెంకి చెందిన పురిని వెంకట రమణయ్య (45) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూ రు జీజీహెచ్‌కు తరలించారు.

వీలుకానిపల్లిలో వృద్ధుడి మృతి

తోటపల్లిగూడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుకానిపల్లి పంచాయతీ దళితకాలనీలో శనివారం అనుమనాస్పదంగా వ1ద్ధుడు మృతి చెందాడు.. పోలీసుల కథనం మేరకు.. దళిత కాలనీకి చెందిన గద్దె శేషయ్య(64) శుక్రవారం రాత్రి బహిర్భూమికి ఇంటి నుంచి సమీపంలో దొరువు వద్దకి వెళ్లాడు. అక్కడ ఏమి జరిగిందో ఏమోకాని ఉదయం పంచాయతీ దొరువులో శవమై కనిపించాడు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేంద్రబాబు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అయితే సంఘటా స్థలంలో సౌతు ఆములూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆధార్‌కార్డు, బ్యాంకు ఏటీఎం కార్డు లభ్యమైందని, ఆదిశగా విచారణ చేస్తున్నామని, త్వరలో వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..


నెల్లూరు(క్రైం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 30 నుంచి 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై మెరూన్, నలుపు రంగు చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు రంగుపై తెలుపు డిజైన్ షార్ట్ ఉన్నాయని తెలిపారు. కుడి చేతిపై ఆర్‌పికేయూ అని ఇంగ్లీషులో అక్షరాలు ముద్రించి ఉన్నాయని, మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలలతో భిక్షాటన

● 10 మంది పిల్లలు, నలుగురు తల్లులు స్టేషన్‌కు తరలింపు

నెల్లూరు(క్రైం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న వారిపై శనివారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, చిన్న బజారు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పది మంది పిల్లలు, నలుగురు తల్లులను చిన్న బజారు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారందరూ గుంతకల్లు ప్రాంతం బెంచ్‌కోటకు చెందిన వారిగా గుర్తించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ చిన్నారులతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలలతో భిక్షాటన చేయిస్తే శిక్షిస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మనుబోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొమ్మలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుమలకు వెళ్లి స్వామి దర్శనం అనంతరం స్వగ్రామం ఒంగో లుకు బయలుదేరారు. ఈ క్రమంలో కొమ్మలపూడి క్రాస్ రోడు వద్ద ముందు వెళుతున్న వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వేగంగా వస్తున్న కారు అదుపు చేయలేక ఆ వాహన్నా ఢీకొంది. దీంతో కారులో ఉన్న కిరణ్‌కుమార్, సౌజన్యకు గాయాలు కాగా, చెన్నకేశవులు, లక్ష్మీకుమారి, ఇద్దరు చిన్నపిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

● గురుజయంతి, ఏడీ పశుసంవర్ధక శాఖ



మర్రిపాడు, మార్చి 1 (ఆంధ్ర జ్యోతి) : పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని పశు సంవర్థక శాఖ ఏడి గురుజయంతి సూచించారు.

? పశువులకు టీకా వేయించకుంటే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయి.

! పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయి.

? టీకాపై రైతుల్లో ఎలాంటి అపోహలున్నా యి.

! పాలు తగ్గుతాయనే అపోహ ఉంది. అటువంటి వాటిని నమ్మవద్దు.

? గాలికుంటు వ్యాధి లక్షణాలు ఏమిటి.

! జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ కారడం.

న్యూస్ బాక్స్

వెంగారెడ్డిపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర



వెంగారెడ్డిపాళెంలో ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్న కార్మికులు

సంగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ స్వర్ణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులచే ఇంటింటా చెత్త సేకరణ చేయించారు. అనంతరం తడి, పొడి చెత్త వేరుచేసి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.


పాఠశాలలో సరస్వతీ విగ్రహం ఏర్పాటు

సంగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మేకల హనుమంతు సహకారంతో ఇటీవల పాఠశాలలో సరస్వతి మందిరం నిర్మించారు. ఆమేరకు వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహం ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

ఉదయగిరి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345.48 కోట్ల నిధులు కేటాయించడంపై ఉదయగిరి మండల అర్చక సంఘం కార్యదర్శి లోకా వెంకటప్రసాద్‌శర్మ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

అదుపుతప్పి కాలువలో ఆటో బోల్తా



ఆటోను బయటకు తీస్తున్న ఎక్స్‌కవేటర్

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ సమీపంలో ఓ ట్రాలీ ఆటో అదుపుతప్పి వ్యవసాయ కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. చిత్తు కాగితాలు సేకరించి ఆటోలో లోడ్ చేసుకుని పామూరు నుంచి ఉదయగిరి వైపు వస్తుండగా గండిపాళెం గ్రామ సమీపానికి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి కాలువలో పడిపోయింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను కాపాడారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సహాయంతో ఆటోను కాలువలో నుంచి బయటకు తీశారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దారు షాజియా

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి ఎస్సీ కాలనీలో శనివారం డిప్యూటీ తహసీల్దారు షాజియా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు కల్పించే హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను పనులకు పంపకుండా బాగా చదివించాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, వార్డెన్ గాయత్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శనివారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులు పొందేందుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయానికి సంబంధించిన దుకాణాలకు మూడు సంవత్సరాల కాలపరిమితికి అద్దె ఇచ్చుటకు బహిరంగ వేలంపాట నిర్వహించగా రూ.4,56,700కు పాటపాడి దక్కించుకున్నారు. అలాగే కొబ్బరిచిప్పలు విక్రయించేందుకు కొప్పవరపు సుబ్రహ్మణ్యం రూ.5,85,000కు పాట పాడి దక్కించుకున్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన వేలంపాటలు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమల్లేశ్వరస్వామి, శ్రీవెంగమాంబ ఆలయాల ఈవోలు కవిత, ఉషశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ



క్షేత్ర పరిశీలన చేస్తున్న కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్స్

ఆత్మకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు ఎస్‌డబ్ల్యుపీసీ నందు చెత్త నుంచి సంపద, ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణ అనే అంశముపై పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్స్‌కు శనివారం ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, విస్తరణాధికారి డేవిడ్ పాల్గొని పలు సూచనలు, సలహాలు అందచేశారు. చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో గ్రీన్ గార్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సదరం ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయిలో జరుగుతున్న దివ్యాంగుల సదరం ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీవో అప్పాజీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య పింఛన్లు, సదరం నవీకరణ మరియు డిజిటలైజేషన్ పూర్తిచేయనున్న దృష్ట్యా వాయిదా వేసినట్లు, మార్చి రెండో వారంలో పరిశీలన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో ఎంపీపీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీతారామపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విభావర్ పవర్ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో జిలా స్థాయిలో జరిగిన పోటీలలో ఎంపీపీ స్పెషల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీలలో భాగంగా ఇంగ్లీషు లిటరసీ ప్రోగ్రాంలో షేక్ అలీఅల్ఫాజ్ మొదటి బహుమతి సాధించగా, సయ్యద్ మహ్మద్ సాఫీర్, ఒక్కా సాత్విక మండల స్థాయి ఛాంపియన్స్‌గా గెలుపొందారు. స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణంరాజు, ఉపాధ్యాయులు రవి, తుల్లా, వెంకటేశ్వర్లు, షాహిద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెన్నవాడలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వార్షిక వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నవాడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, నిత్య అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యాక్రమాలు అలరిం చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కె పెంచలయ్య, మండల విద్యాశాఖాధికారి కె చలపతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా ముళ్లచెట్ల తొలగింపు



రోడ్డుకిరువైపులా ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఉదయగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి పంచాయతీ దేకూరుపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను శనివారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. రహదారికిరువైపులా ముళ్లచెట్లు పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సమస్య పరిష్కరించాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నకు సూచించడంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకృష్ణ, వెంకయ్య, వెంకటసుబ్బయ్య, శివయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి



స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న పెంద్యాల

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించారన్నారు. తొలుత ఆలయ వ్యవస్థాపకుడు పెంద్యాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నర్రవాడ పెట్రోల్ బంకు ఎండీ కొప్పల్లి సురేష్, కొప్పల్లి గురుస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దారు సుభద్ర శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 అక్టోబరు 16వ తేదీకి ముందు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని ఉండి ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



వసతులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో పెంచల నరసింహరావు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో పెంచలనరసింహారావు సూచించారు. శనివారం తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శిం చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళిక అమలు జరిపిన తీరుతో పాటు వెనుకబడిన విద్యార్థులపై తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం భోజనశాల, వసతులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అంద జేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, మౌలాలీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరు విద్యార్థి ప్రతిభ



మనో జశ్వంత్

ఆత్మకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన నెట్ బాల్ క్రీడా పోటీల్లో ఆత్మకూరుకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. పట్టణానికి చెందిన మనోజశ్వంత్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయిలో హర్యానాలో జరిగిన జేనియర్ ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని జిల్లాకు పేరు తెచ్చాడు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సిసి కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఏఎస్ పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ శనివారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్‌లో అమర్చిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. గ్రామంలో ప్రధాన కూడలిలో అమర్చిన సిసి కెమెరాలను పర్యవేక్షిస్తుండాలని, ఎల్లప్పుడూ పనిచేస్తుండేలా చూసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ గోడలు లేని బ్రిడ్జి

● ప్రమాదాల బారిన వాహనదారులు



రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

అనంతసాగరం మార్చి 1 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అనంతసాగరం - బద్వేల్ రోడ్డు గౌరవరం వద్ద పల్లవోలు వాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈప్రాంతంలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈక్రమంలో మార్జిన్‌లో గోడలు లేక వాహనచోదకులు వాగులో పడిపోతున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ. 5,02,157

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 5,02,157 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,050, కుంకుమార్చన ద్వారా రూ. 19,040, వివాహాల ద్వారా రూ. 2 వేలు, తలనీలాల ద్వారా రూ. 22,675, వాహనపూజల ద్వారా రూ. 1,800, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,57,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 600, రూముఅద్దెల ద్వారా రూ. 30,990, కవర్ల ద్వారా రూ. 4,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,64,290, అన్నదానం ద్వారా రూ. 91,412, ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

నెలాఖరు వరకు గాలికుంటు టీకాలు

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెలాఖరు వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టరు ఎస్. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మాచవరం, కోవూరు గ్రామాల్లో టీకాల కార్యక్రమం పూర్తిచేశామని తెలిపారు. ఈనెల 19 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని, 20నుంచి నెలాఖరు వరకు కందుకూరులోని అన్ని వార్డులలో టీకాల కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దనకాలనీ 11కేవీ సబ్‌స్టేషన్ నుంచి కోవూరు ఫీడర్, ఉప్పుచెరువు ఫీడర్లలో లైన్‌వర్క్ ఉన్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు ఫీడర్ పరిధిలోని కోవూరు, నరిశెట్టివారిపాలెం, జిల్లెలమూడి, పందలపాడు, విక్కిరాలపేట గ్రామాలకు, ఉప్పుచెరువు ఫీడర్ పరిధిలోని మగ్గాలమిల్లు ఏరియా, ఉప్పుచెరువు కాలనీ, ఏకలవ్యనగర్, బృందావనం, మాయాబజారు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

బహుమతుల పంపిణీ

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారం రోజులుగా నిర్వహించిన కేపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా, శనివారం జరిగిన ఫైనల్స్‌లో ఒంగోలు జట్టు విజేతగా నిలవగా, సింగరాయకొండ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా సింగరాయకొండ జట్టుకు చెందిన హరీష్, అదే జట్టులోని రసూల్ బెస్ట్ బౌలర్‌గా స్థానాలు దక్కించుకున్నారు. ఒంగోలు జట్టులోని బాలాజీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను కైవసం చేసుకున్నారు. విజేత జట్టుకు రూ. లక్షరన్నరప్ జట్టుకు రూ. 50వేలు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టరు నవీన్‌కుమార్, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 95 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కే. శ్రీనివాసులు చెప్పారు.శనివారం ఆయన లింగసముద్రంలో కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు.మిగిలిన ఐదు శాతం మంది లబ్ధిదారులకు ఆది, సోమవారాల్లో అందజేస్తామని చెప్పారు.

ఇళ్లలోని వ్యర్థాలతో సంపద తయారీ

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద సేకరించే వ్యర్థాలతో కూడా సంపద తయారు చేయవచ్చని ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్ వివరించారు. బోగోలు లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శనివారం మండలంలోని అన్నీ పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తడి వ్యర్థాలను కంపోస్టు ఎరువుగా ఎలా తయారు చేయవచ్చో ఆయన వివరించారు. పచ్చదనంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ జహీర్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బాడన్‌పేటలో నవోదయం 2.0

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప బాడన్‌పేటలో శనివారం సాయంత్రం కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ డీసీ టీ.శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులు నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాల వలన జరిగే పరిణామాలు, నష్టాలను వివరించారు.ఎక్కడైనా సారీ తయారీ, అమ్మకాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, మేకల సాల్మన్‌రాజ్, ఆవుల నాగేశ్వరావు, నెల్లూరు ఏసీ జే.రమేష్, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కిశోర్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్సు మూఢనమ్మకాలను దూరం చేస్తుంది

ఉలవపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ మూఢనమ్మకాలను దూరం చేస్తుందని భీమవరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. బండి సుబ్బారావు అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు, ఉపకరణాల ప్రదర్శన నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు మేడికొండ భాస్కర్, మాలకొండ ప్రసాద్, అనూక్ అభిషేక్, చిట్టిబాబు, శ్రీధర్ మస్తాన్ వలి, హేమలత మాట్లాడుతూ సైన్స్ ప్రత్యేకత గురించి విద్యార్థులకు తెలిపారు.

వంతెన మరమ్మతులు సరే..

● మెట్ల దారికి మోక్షమెప్పుడో..!?
● ధ్వంసమైన గోడలతో ప్రజల అవస్థలు

కావలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెనపై రోడ్డు మార్గంలో మరమ్మతులు చేపట్టారు. కానీ ఆ వంతెనకు రైల్వే రైల్వే లైన్‌కు పడమర వైపున ఉన్న మెట్ల దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేలా ఉంది. దానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కావలి-ఉదయగిరి జాతీయ రహదారిని ఆ వంతెన మీదుగా మద్దూరుపాడు బైపాస్ వద్ద ప్రధాన జాతీయ రహదారికి కలపనున్నారు. అందులో భాగంగా వంతెన పైభాగాన దెబ్బతిన్న మార్గానికి శాశ్వత మరమ్మతులు చేపట్టి అదనంగా తారు రోడ్డు వేస్తూ రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేస్తున్నారు. అంతవరకు అందరూ దానిని అభినందిస్తున్నారు. కానీ ఆ వంతెనపైకి రాకపోకలు సాగించేందుకు రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఏర్పాటు చేసిన మెట్ల దారి పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుంది. దాని చేపట్టు గోడలు ఇప్పటికే కూలి పడిపోయాయి. దీంతో ఆ మెట్ల దారిని రాకపోకలు సాగించాలంటే పాదాచారులు ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని ఆందోళన చెందుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేస్తున్న జాతీయ రహదారి అధికారులు ఆ మెట్ల దారికి కూడా మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని పాదాచారులు కోరుతున్నారు.



దెబ్బతిన్న ఆర్వోబీ మెట్ల మార్గం

శిథిలమవుతున్న లక్ష్యం!

● నిరుపయోగంగా చెత్తతో సంపద కేంద్రాలు

వలేటివారిపాలెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వాహణతో పాటు ఆర్థిక వనరులు మెరుగుపరచాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయంలో నిర్మించిన చెత్తతో సంపద కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మండలంలోని అయ్యవారిపల్లె, అంకభూపాలపురం, నలదలపూరు, బడేవారిపాలెం పంచాయతీల్లో మినహా మిగిలిన 17 పంచాయతీల్లో చెత్తతో సంపద కేంద్రాలు నిర్మించారు. అయితే ఎక్కడా ఇవి పనిచేయడం లేదు. ఈ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. కాగా మూడో శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎక్కడ చూసినా ఫొటోల కార్యక్రమంగా మారింది. మొక్కుబడిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. చెత్త సేకరణను కాలక్షేపంగా మార్చారు. మండల కేంద్రంలో మొక్కుబడిగా ర్యాలీ చేస్తుండగా గ్రామాల్లో అయితే సచివాలయ సిబ్బంది మ.మ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రతి మూడో శనివారం ప్రత్యేక పారిశుధ్య నివారణా కార్యక్రమాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



చెత్త సంపద కేంద్రం వద్ద తగలబెట్టిన చెత్త

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం గౌరవరంలో శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సత్వర పరిష్కారం కోసం స్థానిక టీడీపీ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా, నట్టేట ముంచిందన్నారు. మనీ స్కీంలాగా కాకినాడ, మచిలీపట్నంలో మిల్లర్లు ధాన్యం తోలించుకుని నగదు ఇవ్వకుండా మోసగించారని, దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు చేయాలని రైతులకు సూచించారు.మండలం లోని గౌరవరం, ఆముదాలదిన్నె, అన్నగారిపాలెం- 1, చెంచుగానిపాలెం, తాళ్లపాలెం, తుమ్మలపెంట, చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం, ఆనెమడుగు, సర్వాయపాలెం, రుద్రకోట, చలంచర్ల, కొత్తపల్లి, సిరిపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఏడీఏ నాగరాజు, ఏవో లలిత, పంచాయతీ కార్యదర్శి అఖిల, స్థానిక నాయకులు సూరె శ్రీనివాసులు రెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● ఫొటోలు తీపి గుర్తుగా నిలుస్తాయి

కావలి, (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ వృత్తి చాలా విలువైనదని, వారు తీసే ఫొటోలు జీవితంలో తీపి గుర్తులుగా మిగులుతాయని ఎమ్మెల్యే కావ్య వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన సంద్ర ప్రసాద్ ప్యానల్ శనివారం మునునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలశారు. ఆయన ప్యానల్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలిని కనకపట్నంగా చేయటంలో మీ అసోసియేషన్ కూడా భాగస్వాములను చేసుకుని, ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు వీ. హనోక్‌పాల్, కార్యదర్శి చిలకపాటి మనోహర్, కోశాధికారి పులిశెట్టి మల్లిక్, సంయుక్త కార్యదర్శులు పిల్ల చంద్ర, చిత్రకళ మాలి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

అల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. మాడభూషి కృష్ణమాచారి మెమోరియల్ ట్రస్ట్ (హైదరాబాద్) 107 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయలు శ్రీధర్‌రావు, సుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లైఫ్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఐ.బాలక్రిష్ణయ్య, జీ.అనుసూయమ్మ, గంటా అరుణ, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : విద్యార్థికి పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



కొండాపురం : విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందచేస్తున్న హెచ్‌ఎం బాలక్రిష్ణయ్య తదితరులు

అమరవీరుల సంస్మరణ దినం

కొండాపురం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో అమరులైన మాదిగలకు శనివారం మండలంలోని సాయిపేటలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంస్మరణ దినం నిర్వహించారు. సీనియర్ నాయకుడు మందా నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు ముందుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నలగట్ల ఆశీర్వాదం, కొప్పర్తి సురేష్, కే. ఆంథోనిబాబు, కే.కిషోర్, ఎర్మియా, మధు తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం : మాట్లాడుతున్న మందా నాగేశ్వరరావు

● లింగసముద్రంలో

లింగసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగ జాతివీరులకు ఎమ్మార్పీఎస్ నేతలు నివాళి అర్పించారు. శనివారం జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ మండలంలోని శింగరపాలెం, జంపాలవారిపాలెం గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా అమరులైన మాదిగ జాతిబిడ్డలకు సంతాపం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎడ్ల డేవిడ్, అవినాష్, కూచిపూడి చింటు, బుంగ వంశీ, ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థపై అవగాహన

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడీ వ్యవస్థపై నెల్లూరుకి చెందిన ప్రముఖ వైద్యురాలు బిందుమీనన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీ ఎన్.రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, అన్నీ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బిందుమీనన్

నలుగురికి ఒక్కరే రేడియాలజిస్ట్

● కావలి ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలు అందేదెలా?

కావలి,మార్చి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నలుగురికిగాను ఒక్కరే రేడియాలజిస్ట్ ఉన్నారు. దీంతో ప్రమాదాల బారిన పడినవారికి అత్యవసర వైద్యసేవలు ఎలా అందుతాయని వైద్యశాల వర్గాలు చర్చించుకుంటున్నాయి. 24 గంటలు అందుబాటులో ఉండే కావలి ఏరియా వైద్యశాల స్థాయికి వాస్తవంగా ఆరుగురు రేడియాలజిస్టులు ఉండాలి. అయితే ప్రస్తుతం వైద్యశాలలో నాలుగు పోస్టులు మాత్రమే ఉన్నాయి. వారిలో మొన్నటి వరకు ముగ్గురు రేడియాలజిస్టులు ఉండగా వారిలో ఇద్దరు బదిలీపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఒకే ఒక రేడియాలజిస్ట్ ఉండటంతో అత్యవసరసేవలు ఇబ్బందికరంగా ఉన్నాయి. కావలి ఏరియా వైద్యశాల జాతీయరహదారి వెంబడి ఉండటంతో రహదారిపై ప్రదాలు జరిగినవారు కావలి ఏరియా వైద్యశాలకు వస్తారు. అలాగే ఉదయగిరి మార్గంలో కూడా వింజమూరు వరకు రోడ్డు ప్రమాద బాధితులు కావలి ఏరియా వైద్యశాలకు వస్తారు. ఒక సమయం అంటూ లేకుండా 24 గంటల్లో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్తితి. ఈ పరిస్థితిలో క్షతగాత్రులు కావలి ఏరియా వైద్యశాలకు వచ్చినపుడు వారికి జరిగిన ప్రమాదాల తీవ్రతను తెలుసుకునేందుకు ఎక్స్‌రేలు తీస్తే కానీ తెలియదు. అయితే ఒకే రేడియాలజిస్ట్ ఉండడంతో ఆయన విధులు ముగించుకుని వెళ్లిన సమయంలో బాధితులు వస్తే ఏమి చేయాలో తెలియక వైద్యులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక వేళ ఆయన సెలవు పెట్టినా, ఆదివారం లాంటి సెలవుదినాలలో, ఆయన విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన సమయంలో ప్రమాద బాధితులు వస్తే వారికి వైద్యసేవలు అందించేందుకు ఎక్స్‌రేలు ఎవరు తీయాలి అనేది పెద్ద సమస్యగా తయారైంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డివిజన్ కేంద్రమైన కావలి ఏరియా వైద్యశాల అవసరాలకు తగినట్లుగా రేడియాలజిస్టులను నియమించి ప్రజలకు సరైన వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఏరియా వైద్యశాలలోని ఎక్స్‌రే రూము

క్రాకుటూరు హైస్కూల్‌లో సరస్వతీ పూజ

కలిగిరి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రాకుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష సామగ్రిని అమ్మవారి ఎదుట ఉంచి పూజలు నిర్వహించారు. గ్రామంలోని పీఎంకే ఎస్‌కే హజరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నవేళ విద్యార్థులు కష్టపడి చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని తెలిపారు. పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించడంతోపాటు ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయభారతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రాకుటూరు హైస్కూల్‌లో జరిగిన సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గాలి, వెలుతురు లేక ఇంటర్ విద్యార్థుల అవస్థలు

కావలిటౌన్, మార్చి1(ఆంధ్రజ్యోతి)ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆర్ఐవో పర్యవేక్షణలో జరిగి పరీక్షల్లో ఐదుకేంద్రాల్లో కలిపి 2,206 మంది పరీక్షలు రాయాల్సివుండగా 2,106మంది రాశారు. కొన్ని కేంద్రాల్లో ఇరుకు గదులు, సరైన గాలి, వెలుతురు లేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసు

భ్రూణ హత్యలు నిర్మూలించాలి

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యలను నిర్మూలించడం కోసమే కేంద్రం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కాకుటూరు లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు అనంతరం ఫ్లెక్సీలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

కుంటల ప్రయోజనంపై అవగాహన కల్పించాలి

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) కుంటల ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి హమీ ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలలోని కొంసముద్రం, నూకవరం, పోకూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో ఉమామహేష్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీలకు సరాసరి వేతనం రూ.300 లభించేలా కొలతలపై అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీకి 25 రైతువారీ కుంటలకు తగ్గకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు అశోక్, నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుబ్బారాయుడు, హరిబాబు ఉన్నారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ బాబూరావు

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని హైస్కూల్‌లో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం హెచ్‌ఎం కమల్‌కుమార్ జరిగిన కార్యక్రమంలో చుండి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వరు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.



సరస్వతీ పూజ చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

లక్ష్మీ నృసింహుడి సేవలో విజయనగరం ఎంపీ

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని శనివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి శాలువా,పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాని హర్షకుమార్, తదితరులు ఉన్నారు.




దర్శనానంతరం అనుచరులతో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

ఆగిన ఆధార్ సేవలు

● మరమ్మతులకు గురైన ప్రింటర్ ● 10 రోజులుగా ప్రజలకు తప్పని ఇబ్బందులు

లింగసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఆధార్ సేవలు 10 రోజులుగా నిలిచిపోయాయి. ప్రింటర్ మరమ్మతులకు గురవడంతో ప్రజలు ఆధార్ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఆధార్‌కార్డులు తీసుకొనే వారు, ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలన్నా ఇంకా ఇతర సేవలు పొందాలన్నా ఈ సచివాలయం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పలువురు నానా అగచాట్లు పడుతున్నారు. లింగసముద్రం, ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, పెంట్రాల, గంగపాలెం, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, వీఆర్ కోట తదితర గ్రామాల ప్రజలు మండలంలోని చినపవని, వలేటివారిపాలెంలోని ఆధార్ కేంద్రాలకు వెళుతున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లింగసముద్రం-1 సచివాలయంలో మరమ్మతులకు గురైన ఆధార్ ప్రింటర్

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు : తహసీల్దార్

కావలి, మార్చి1(ఆంధ్రజ్యోతి) రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కావలి మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రేషన్ బియ్యం ప్రతి కార్డుదారుడికి అందాలని, అలా అందకుండా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వరికైనా బియ్యం చాలడం లేదని ముందుగా చెబితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 10 శాతం అదనంగా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ విజయమ్మ, గోదాము ఇన్‌చార్జి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వానరానికి సపర్యలు చేస్తున్న నారాయణమ్మ



కుక్కల దాడిలో గాయపడిన వానరం

వానరానికి గాయం.. తల్లిలా సపర్యలు

కలిగిరి జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడపై రోజూ ఓ కోతి వచ్చి కూర్చుంటుండేది. పదేళ్లుగా అక్కడే తోపుడు బండిపై తినుబండారాలు అమ్ముకుంటున్న నారాయణమ్మ ఆ వానరానికి రోజూ ఏదో ఒకటి పెడ్తుండేది. విద్యార్థులు కూడా తినుబండరాలు పెట్టేవాళ్లు. ఈ క్రమంలో శనివారం ఆమె ఇంటి వద్ద నుంచి స్కూలు వద్ద వచ్చేసరికి కుక్కలగుంపు ఆ వానరంపై దాడి చేశాయి. దీంతో అది తీవ్రంగా గాయపడింది. రక్తగాయాలతో ఉన్న ఆ వానరాన్ని చూసి నారాయణమ్మ మనస్సు తల్లడి ల్లింది. వెంటనే దాన్ని తోపుడుబండిపై స్థానిక పశువైద్యశాలకు తరలించింది. వైద్యాధికారి పరీక్షించి యాంటిసెప్టిక్ ఇంజక్షన్ వేసి, గాయాలు తగ్గడానికి మందులు ఇచ్చారు. దీంతో ఆ వానరం కొద్దిగా కోలుకుంది.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం

● 8 వరకు ప్రత్యేక కార్యక్రమాలు : ఏఎస్పీ

నెల్లూరు(క్రైం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 వారోత్సవాలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. వీటిని శనివారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఉన్న ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రారంభించారు. వైద్య శిబిరం, ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, విద్య, ఉద్యోగం, పారిశ్రామిక రంగాల్లో మహిళలు ముందుకు రావడం ద్వారా సమాజం మరింత పురోగమిస్తుందని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేది వరకు మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యత కు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే ప్రచారాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాల పనితీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సింధుప్రియ, చంద్రమోహన్, సీఐ నాగేశ్వరమ్మ, నారాయణ వైద్యశాల డాక్టర్ డాక్టర్ మధులేఖ, గులాబీ, దీప్తి, హిమ అనురాగ్, ప్రఖ్య, ప్రసన్న, మంజు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నగర డీఎస్పీ సింధుప్రియ



ఓపెన్ హౌస్‌ను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సౌజన్య

తక్కువ ధరకే నుడా ప్లాట్లు

● అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి, వీసీ సూర్యతేజ

నెల్లూరు (జడ్పీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నుడా పరిధిలోని అన్నీ నియోజకవర్గాల్లో ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో ప్రజలకు తక్కువ ధరకే ఇళ్ల ప్లాట్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నుడాకు సంబంధించిన ప్రత్యేక సమావేశాన్ని శనివారం నుడా కార్యాలయంలో వారు నిర్వహించారు. నుడాకు సిబ్బంది, లేఅవుట్ల అభివృద్ధి, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై నుడా వీసీ సూర్యతేజ, అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నుడా పరిధిలో ప్రత్యేకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరంతో పాటు మున్సి పాలిటీలు, పంచాయతీలలో ఎంఐజీ లే అవుట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్రమ లేఅవుట్లలో ఎవరూ ప్లాట్లు కొనొద్దని సూచించారు. ప్రభుత్వ భూముల్లోనూ కొందరు లేఅవుట్లు వేశారని, వాటన్నింటిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. నెల్లూరు ప్రత్యేకతను చాటుతూ నెల్లూరు సెల్ఫీ బోర్డు లను కలెక్టర్ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నగరంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలు, పాఠశా లలు, కళాశాలల వద్ద ఐలవ్‌యూ నెల్లూరు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ లు దేశ నాయక్, గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఆర్డీవో వంశీకృష్ణ, నుడా సెక్రటరీ పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖహాజరు తప్పనిసరి!

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకురాలు పద్మావతి

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ముఖహాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకురాలు డాక్టర్ పద్మావతి స్పష్టం చేశారు. శనివారం నెల్లూరుకు వచ్చిన ఆమె జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అధికారులు, సిబ్బందితో వేర్వేరుగా సమీక్షించారు. విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఫైలు ఈ ఆఫీసు ప్రక్రియ ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపీ, ఐపీలతోపాటు ప్రసవాలు, ల్యాబ్ పరీక్షలు ఐయూడీసీల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గ్రేడింగ్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పీ, డీ గ్రేడ్‌లు వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రేడింగ్‌లు మెరుగు పడేలా ప్రోగ్రాం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కాలం చెల్లుతున్న మందులను అవసరమైన పీహెచ్‌సీలకు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సుజాత, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

● ఏపీ రైతు సంఘాల డిమాండ్

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, గురునాథం డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం లేక రోడ్లపైనే రాశులుగా పోసుకుంటున్నారన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాలకు వెళితే అక్కడి అధికారులు మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ రాలేదని, తేమ కొలిచే మిషన్లు చెడిపోయాయని, గోతాలు అందుబాటులో లేవని... సాకులు చెప్పి పంపించేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు పొట్టేపాళెం చంద్రమౌళి పాల్గొన్నారు.

చిత్రకళలో దిట్ట బాలకృష్ణ

● శ్రీకృష్ణుడి బొమ్మలు గీయడంలో అందవేసిన చేయి

● ప్రత్యేక శైలితో బహురూపాల చిత్రాలు సృష్టి

● ఎన్నో ప్రదర్శనలు, ప్రశంసలు

శ్రీకృష్ణుడి బహురూప చిత్రాలు వేయడంలో చిత్రకారుడు బాలకృష్ణది ప్రత్యేక శైలి. ఆయన వేసిన శ్రీకృష్ణుడి చిత్రం చూసారంటే వెంటనే కొనుగోలు చేయాల్సిందే. ఆయన పుట్టింది నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని అల్లీపురం. గ్రామంలోని మద్దెల హరికోటేశ్వరరావు, తులసిలక్ష్మీ దంపతులకు ఆయన జన్మించారు. ఎంఏ పూర్తి చేసుకుని విశ్వం ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చిత్రలేఖనంపై ఆసక్తి ఉండడంతో ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు. చిత్రలేఖనాన్ని స్వయంగా నేర్చుకుని ఏపీ ప్రభుత్వం నిర్వహించే డ్రాయింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. మెరుగైన చిత్రాలు వేయాలన్న ఆకాంక్షతో అమీర్ ఆర్ట్స్ అకాడమీ అధినేత డాక్టర్ అమీర్‌జాన్ వద్ద కాన్వాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొందారు. విద్యార్థులకు మంచి గురువుగానే కాక, తమ విద్యార్థులకు చిత్రలేఖనం పట్ల ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇప్పిస్తున్నారు.



కేరళలోని వాయనాడులో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ (ఫైల్)

● పలుచోట్ల ప్రదర్శనలు

బాలకృష్ణ వేసిన చిత్రాలను దక్షిణ భారత దేశంలో జరిగిన పలు చిత్ర ప్రదర్శనల్లో ప్రదర్శించారు. 2024 నవంబరులో కేరళ రాష్ట్రంలోని వాయనాడులో తన చిత్రాలను దక్షిణ భారత ఆర్ట్ క్యాంపులో ప్రదర్శించి ప్రశంసాపత్రం అందుకు న్నారు. ఈ ఏడాది జనవరి 18న నెల్లూరు వర్ధమాన సమాజంలో జరిగిన నెల్లూరు కలర్స్ చిత్రకళా ప్రదర్శనలో బాలకృష్ణ వేసిన కృష్ణుడి చిత్రాలు ఎక్కువగా అమ్ముడుపోయాయి. అందరి చేత ప్రశంసలు పొందారు. వచ్చే ఏప్రిల్ 4, 5, 6తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆయన శ్రీకృష్ణుడి చిత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. చిత్రకళను ప్రచారంచేయడంతోపాటు అంతరించిపోతున్న ఈ కళకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నానని బాలకృష్ణ తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



చిత్రాలకు రూపురేఖలు దిద్దుతున్న బాలకృష్ణ

నార్త్‌రాజుపాళెం జడ్పీ పాఠశాలకు జాతీయ అవార్డు



ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం ఓబులేష్

నెల్లూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయి గ్రీన్‌స్కూల్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ఆడిట్‌లో ఈ పాఠశాలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా ఐదు శాతం పాఠశాలలు మాత్రమే పర్యావరణహిత కార్యక్రమాల ద్వారా ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ క్రమంలో ఢిల్లీలో జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్, పాఠశాల ఉపాధ్యాయుడు కే భక్తవత్సల బాబు అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో జీఎస్పీ ఆడిట్ లో పాల్గొన్న 8వతరగతి విద్యార్థులకు, సహకారం అందించిన ఉపాధ్యాయు లకు హెచ్‌ఎం డీ ఓబులేష్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీఏలు ఇప్పించండి సార్!

● గత నెలలో అంగన్‌వాడీలకు శిక్షణ

● వారం గడిచినా అందని రవాణా భత్యం

● రూ.8.69 లక్షల నిధులపై నీలినీడలు

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల కేంద్రాల్లో వినూత్న రీతిలో బోధించేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్వశిక్షా అభియాన్ సారథ్యంలో శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సుమారు 2,934 మెయిన్, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 2,899 మంది కార్యకర్తలు విధులు నిర్వహిస్తు న్నారు. జ్ఞానజ్యోతి పేరుతో వీరికి ఫిబ్రవరి 18, 19, 20, రెండో విడతగా అదేనెల 22, 24, 25వ తేదీల్లో శిక్షణ ఇచ్చారు. ఆరు రోజుల శిక్షణ కాలంలో ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.50 రవాణా భత్యం (టీఏ) చెల్లించడంతోపాటు భోజనం, స్నాక్స్ అందజేయాలి. శిక్షణ కాలంలో కొందరు తొలిరోజు భోజనానికి ఎగనామం పెట్టారు. తరువాత రోజు నుంచి భోజనం, స్నాక్స్, టీ అందజేశారు. శిక్షణ చివరి రోజున కార్యకర్తలతో అక్విటెన్స్ సంతకాలు తీసుకొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లేదా సీఆర్‌ఎంటీల ద్వారా టీఏ నగదు పంపుతామని సూచించారు. అయితే రోజులు గడుస్తున్నా నగదు అందించకపోవడంతో కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపు ఇలా..

జిల్లాలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం సుమారు రూ.49.22 లక్షలు కేటాయించింది. శిక్షణ కాలంలో ఒక్కో రోజుకు రూ.50 వంతున ఆరు రోజులకు రూ.300 ప్రకారం 2,899 మంది కార్యకర్తలు రూ.8.69 లక్షలు, భోజనం, స్నాక్స్ కోసం రోజుకు రూ.200 ప్రకారం ఆరు రోజులకు రూ.34.74 లక్షలు, స్టేషనరీ, జెరాక్స్ కోసం రూ.200 చొప్పున రూ.5.79 లక్షలు కేటా యించారు. అయితే శిక్షణ ముగిసి రోజులు గడు స్తున్నా రవాణా భత్యం అందకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో కూడా అంగన్‌వాడీ కార్య కర్తలకు టీఏ, డీఏలు ఎగ నామం పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రవాణా భత్యం అందేలా చూడాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

60 శాతం నిధులు చెల్లించాం

'జ్ఞానజ్యోతి' శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే 60 శాతం నిధులు చెల్లించాం. రవాణా భత్యం ఎంతవోలే అందజేయాలి. కార్యక్రమానికి సంబంధించిన యూసీలు అందజేస్తే మిగిలిన 40 శాతం నిదులు కూడా అందజేస్తాం.

- వెంకటసుబ్బయ్య, ఎస్ఎస్ఏ, ఏపీసీ



ఉదయగిరిలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న విద్యా శాఖ, ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

4న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సంహపురి యూనివర్శిలో ఈనెల 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయి మెంట్, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు ఏడుగురి గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహ పురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం జరిగిన డిగ్రీ రెండవ, ఐదవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 177 మంది విద్యార్థులకు 170 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఆక్వా సర్వీసులపై విజిలెన్స్ దాడులు

● విద్యుత్ అక్రమ వినియోగంపై కేసులు

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : కావలి రూరల్ మండలంలో ఆక్వా విద్యుత్ సర్వీస్‌లపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వ హించినట్లు విజిలెన్స్ ఈఈ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించామన్నారు. ఆరుగురు ఆక్వా సాగుదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండడంతో వారిపై కేసులు నమోదు చేసి రూ.4 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఆకస్మిక దాడులు నిరంతరం కొనసాగుతుంటాయని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8178
వెండి కిలో ధర	రూ. 96,400
వెండి ఒక గ్రాము	రూ.99.40

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మిల్లుల అనుసంధానం

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

సంగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను అనుసంధానం చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. శనివారం ఆయన సంగం సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉన్నారా, లేదా పరిశీలించారు. గోనె సంచులు అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్‌వోలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనకపోవడంతో వెంటనే ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం అర్జునరావు, డీఎస్‌వో అంకయ్య, అగ్రికల్చర్ జేడీ సత్యవాణి, తహసీల్దారు సోమ్లా నాయక్, ఏవో శ్రీహరి, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు బోణీ

జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో సంగం ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం కంఠాబత్తిన వినోద్, శ్రీహరి అనే రైతుల నుంచి 190 బస్తాల ధాన్యం కొనుగోలు చేయడంతో జిల్లాలో బోణీ జరిగినట్లయింది. ఈనెల 22వ తేదీన సంగంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ శనివారం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రానికి గోనె సంచులు రాలేదు. అయితే జాయింట్ కలెక్టర్ రాకతో అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుకు మిల్లు నుంచి గోనె సంచులు తెప్పించి ఇచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. జేసీ రాకతో ధాన్యం కొనుగోలుకు అడుగు పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

అల్లుకున్న నిర్లక్ష్యం..!

● ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను కమ్మేసిన చెట్లు

పొదలకూరు పట్టణంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు తీగలకు చెట్లు అల్లుకుపోయి అత్యంత ప్రమాదకరంగా ఉంది. చెట్ల తీగలు హైటెన్షన్, లో టెన్షన్ వైర్లను చుట్టుముట్టేశాయి. అలాగే గంగమ్మ గుడి దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల పరిసరాల్లో చెట్ల పొదలు పెరిగి పందిరిగా కమ్మేసి వైర్లు కూడా కనిపించడం లేదు. సాధారణంగా గాలి, వర్షానికి చెట్లు కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెట్ల కొమ్మలను తొలగిస్తారు. కానీ కొన్ని రోజులుగా అల్లుకుపోతున్న తీగలను తొలగించకుండా సిబ్బంది చోద్యం చూస్తున్నారు. అధికారులు, స్పందించి చెట్లను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- పొదలకూరు(ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): మారుమూల గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభి వృద్ధి చేయడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తు న్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిపాలెంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం విస్మరించిన గ్రామీణాభివృద్ధి కూటమి అధికారంలోకి వచ్చాక గాడిలో పడిందన్నారు. రెడ్డిపాలెం నుంచి చెర్లోపాలెం, వేగూరు, మోడేగుంట, ముదివర్తి గ్రామాలకు మార్గ మధ్యంలో తెగిపోయి ఉన్న బ్రిడ్జిను సాధ్యమైనంత త్వరలో పునర్నిర్మిస్తామని తెలిపారు. పేదలకు నివేశ స్థలాలు, ఇళ్లు నిర్మిస్తామన్నారు. అనంతరం రాజుపాలెంలో సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో జయభారతి హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు ముంగమూరు శ్రీహరిరెడ్డి, నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బద్వేల్ వినీల్‌రెడ్డి, చెక్క మదన్, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జయభారతి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండండి

నెల్లూరు(హరనాధపురం): కోవూరు నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలోని ఆమె నివాసంలో ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా సంస్థ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా 24 గంటల్లో పరిష్కరించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే 14, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు వినియోగించాలని కోరారు. మార్చి 2 నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు మొదలవుతున్న నేపథ్యంలో మసీదుల వద్ద మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని మసీదులకు వీపీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో క్యాన్‌ల ద్వారా కూలింగ్ వాటర్ సరఫరా చేస్తామన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

● డీఎల్‌పీవో రమణయ్య



మాట్లాడుతున్న నెల్లూరు డీఎల్‌పీవో రమణయ్య

మనుబోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని నెల్లూరు డీఎల్‌పీవో పీ.రమణయ్య అన్నారు. మనుబోలు చెత్తసంపద తయారీ కేంద్రంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీల్లో ఇంటి నుంచి చెత్తసేకరణ, సేకరించన చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం, అక్కడ వర్మికంపోస్టు తయారీ, కేంద్రం నిర్వహణ గురించి పూర్తిస్థాయిలో డీఆర్‌పీ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మనుబోలు ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్త సేకరించారు. గ్రామాల్లో వ్యర్థపదార్థాలు ఎక్కడపడితే అక్కడ ఉండకూడదని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి నారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు..!

● కాలువలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు
● పారిశుధ్యం మెరుగుకు చర్యలు శూన్యం
● కానరాని ఫాగింగ్, నివారణ కార్యక్రమాలు
● బెంబేతెత్తుతున్న ప్రజలు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు



కసుమూరులో జనవాసాల మధ్య డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

వెంకటాచలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దోమలు.. ఈ పేరు చెబితేనే అందరిలోనూ వణుకు పుడుతోంది. అది చాలా చిన్న జీవి అయినా కుట్టిన తర్వాత దానివల్ల కలిగే అనారోగ్య సమస్యలే ఇందుకు కారణం. రాత్రి వేళల్లో కంటి నిండా నిద్ర లేకుండా ప్రాణాలతో చెలగాట మాడుతోన్నాయి. రోజంతా పని చేసి సాయంత్రం ఇంటికి వచ్చి కాస్త విశ్రాంతి తీసుకుందామనుకుంటే దోమల పరేషాన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రలైన కసుమూరు, గొలగమూడిలతోపాటు సర్వేపల్లి, వెంకటాచలం, పూడిపర్తి, కసుపూరు, అనికేపల్లి, కాకుటూరు, చెముడుగుంట, నిడిగుంటపాళెం, ఇడిమేపల్లి, కంటేపల్లి, తాటిపర్తిపాళెం, ఎగువమిట్ట, కందలపాడు తదితర గ్రామాల్లో దోమల బెబద ఎక్కువగా ఉంది. దాదాపు అన్ని గ్రామాల్లో దోమల వృద్ధి అధికంగా ఉంది. ఎన్నో వేల రకాల దోమలు ఉన్నా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు కలగజేసే దోమలే జిల్లాలో ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపులు చెబుతుంటారు. దోమల నివారణ కోసం గ్రామాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. అక్కడక్కడ నీటి నిల్వలు పేరుకుపోవడం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, డ్రైయినేజీ కాలువల్లో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వ్యర్థాలు పేరుకుపోవడంతోపాటు ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం లోపించడంతో దోమల వృద్ధి చెందుతోన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల భారినపడే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమల నివారణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నా అవి అచరణకు నోచుకోవడం లేదు. మన చుట్టు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామాల్లో కనీసం పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, డ్రైనేజీ కాలువలు, మురుగు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికట్టడం, ఫాగింగ్ మిషన్లు వినియోగించడం లాంటివి తమకు ఏం పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో గ్రామాల్లో దోమల సమస్య విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో దోమల పిచికారి మందు స్ప్రే చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కమనీయం శ్రీనివాసుడి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం భక్తులను అలరించింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పుట్టా సుబ్రమణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ, ప్రదీప్, రావులపల్లి హరీష్‌బాబు కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి గజవాహన సేవ జరిగింది.

మాదిగ అమరవీరులను జాతి మరచిపోదు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరులను జాతి మరచిపోదని గొల్లపల్లి శ్రీనివాసమాదిగ అన్నారు. శనివారం మండలంలోని రేబాలలో నిర్వహించిన మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకోసం జరిగిన ఉద్యమంలో మాదిగ జాతి భవిష్యత్తుకోసం అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, దర్శిగుంట శ్రీనివాసులు, కుడుములు శ్రీనివాసులు, డి.సునీల్, మల్లికార్జున పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం

దుత్తలూరు(ఉదయగిరి) : నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శనివారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులు పొందేందుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయానికి సంబంధించిన దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితికి రూ.4,56,700కు పాటపాడి దక్కించుకున్నారు.

2.90 లక్షల పింఛన్ల పంపిణీ



మిలటరీ కాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొత్తం 3,07,232 పింఛన్లకుగాను 2,90,034 పింఛన్లను పంపిణీ చేశారు. 94.40 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో మున్సిపల్ మంత్రి నారాయణ, మిలటరీ కాలనీలో కలెక్టర్ ఆనంద్ పింఛన్లను పంపిణీ చేశారు.

కనిగిరి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు



కనిగిరి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న ఎక్స్‌కవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డు నిర్మాణం పేరుతో మండలంలోని పురందరపురం సమీపంలో కనిగిరి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతోన్నాయి. రిజర్వాయర్ తీరం వెంబడి ఎక్స్‌కవేటర్‌తో ఓవైపు తవ్వుతుండడంతో మరోవైపు తవ్వినచోట రిజర్వాయర్ జలాలు ఊరుతున్నాయి. ఐనా గ్రావెల్ తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. సీసీ రోడ్డు పేరుతో ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి రెండు ట్రిప్పులుతోలితే ట్రిప్పు రూ.600 వంతున సుమారు 100 ట్రిప్పులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



కాగితాలపూరు క్రాస్‌రోడ్డులో భూములు పరిశీలిస్తున్న తహసీల్దారు సుబ్బయ్య

నుడా లేఅవుట్ కోసం స్థల పరిశీలన

మనుబోలు, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): నుడా మోడల్ లేఅవుట్ కోసం శనివారం తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య స్థల పరిశీలన చేశారు. బండేపల్లి రెవెన్యూ పరిధి లోని కాగితాలపూ రు క్రాస్‌రోడ్డు సమీపంలో దాబా పక్కనే ఉన్న సర్వే నెంబర్ 434లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన రికార్డుల ప్రకారం హద్దులు ఉన్నా యా, లేవా పరిశీలించారు. ఇందు లో నుడా మోడల్ లేఅవుట్ వేసి పేదలకు తక్కువ ధరకే స్థలాలు ఇవ్వనున్నారని తహసీ ల్దారు తెలిపారు.

● ఇండస్ట్రియల్ పార్క్ కోసం..

ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో ఇండస్ట్రీ యల్ పార్కు కోసం 25 ఎకరాల ప్రభుత్వ స్థలం పరిశీలన చేయాలని చెప్పడంతో తహసీ ల్దారు సుబ్బయ్య, ఏపీఐఐసీ మేనేజర్ వినోద్‌తో కలిసి మూడు గ్రామాల్లో స్థల పరిశీలన చేశా రు. బండేపల్లి, చెరుకుమూడి, అక్కంపేట రెవెన్యూ గ్రామాల్లో రోడ్డు పక్కగా ఎంతమేర ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఆ భూములు, ఆ ప్రాంతాలు పరిశ్రమల స్థాపనకు అనుకూలత అంశాలను గుర్తించి నివేదిక తయారు చేశారు. నివేదికను ప్రభు త్వానికి పంపితే తదుపరి ఆదేశాల తరువాత ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై స్పష్టత వస్తుం దని తహసీల్దారు వివరించారు. ఈ కార్యక్ర మంలో సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్‌వోలు సురేంద్ర, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో 2023, ఏప్రిల్ నుంచి 202,4 మార్చి 31 వరకు జరిగిన రూ.5.29 కోట్ల ఉపాధి పనులపై ఎంపీడీఓ శ్రీహరి అధ్యక్షతన కార్యాలయ ఆవరణలో శనివారం ప్రజావేదిక జరిగింది. డ్వామా పీడీ గంగాభవాని పాల్గొని ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటంపై రూ.90,992, సీసీ రోడ్డు నాణ్యతాలోపంపై రూ.34వేలు రికవరీకి ఆదేశించారు.

'సర్వేపల్లి'లో నీటి నిల్వకు అవకాశమేదీ?

సామర్థ్యం 1.74 టీఎంసీలు ● ఆయకట్టు 40 వేల ఎకరాలు
● అసంపూర్తిగా అభివృద్ధి పనులు
● ఇది రిజర్వాయర్ పరిస్థితి




సర్వేపల్లి రిజర్వాయర్

వెంకటాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో స ర్వేపల్లి రిజర్వాయర్ ఒకటి. 1.74 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ నుం చి సుమారు 40 వేల ఎకరా లకు సాగునీరందుతోంది. అయితే సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట వరదలు, తుఫాన్ల కారణం గా కోతకు గురైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ ప నులు 40 శాతం వరకు జరిగాయి. ఆ పనులు కూడా పూర్తికాకపోవడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం లేదు. 40 శాతం వరకు పనులు జరిగిన అవి అత్యంత నాసిరకంగా ఉండడం వల్ల మొన్నటి మిచౌంగ్ తుఫాన్ సమయంలో కట్ట అక్కడక్కడ కోతకు గురైంది. దీంతో కట్ట తెగ్గిపోకుండా మట్టి, ఇసుక బస్తాలు అక్కడక్కడ పెట్టారు. ఈ క్రమంలో సర్వేపల్లి రిజర్వాయర్ 12 అడుగుల నీటి మట్టం కలిగి ఉన్నప్పటికీ ప్రస్తుతం 9 అడుగులు మాత్రమే నీరు ని ల్వ ఉంది. వేసవి, సాగు అవస రాల దృష్ట్యా నీరు పైనుంచి విడుదల అయితే తప్ప రిజర్వాయర్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు సరిపోదని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై సర్వేపల్లి రిజర్వాయర్ ఇరిగేషన్ ఏఈ వేమారెడ్డి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పై నుంచి నీరు విడుదల అవుతుందన్నారు. రైతులకు, ప్రజలకు ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా నీరు అందిస్తామ న్నారు. వేసవి, సాగు అవసరాలకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఏఈ వేమారెడ్డి వెల్లడించారు.

నీటి వృథాను అరికట్టరా!?

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్‌లో ఏళ్ల తరబడి సాగునీటి వృథా అవుతున్నా పట్టించుకునే అధికారులు కరవయ్యారని ఆయకట్టు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కనిగిరి రిజర్వాయర్ సామర్థ్యం 3.45 టీఎంసీలు, 21.5 అడుగులు కాగా ప్రస్తుతం నీటి నిల్వ గేజ్ ప్రకారం 2.45 టీఎంసీలు, 19.3 అడుగులు ఉందని కనిగిరి రిజర్వాయర్ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఇందులో సుమారు 1 టీఎంసీకిపైబడి పూడిక ఉంది. ప్రజలు, మూగజీవాల తాగునీటి అవసరాల కోసం అర టీఎంసీ నీరు నిల్వ ఉంచాల్సి వుంది. మిగిలింది అర టీఎంసీ మాత్రమే. ఈ క్రమంలో వేసవి దృష్ట్యా దశల వారీగా సోమశిల జలాలు వదిలితేనే రెండో పంటకు సాగునీరు అందించాల్సిన పరిస్థితి. కాగా పైడేరు చానల్ పరిస్థితిని చూసి మరమ్మతులు చేపట్టి సాగునీటి వృథా కాకుండా చర్యలు చేపడతామని రిజర్వాయర్ ఏఈ ప్రసాద్ తెలిపారు.



పైడేరు చానల్‌లో వృథాగా పోతున్న నీరు

నేర వార్తలు

పొదలకూరు శ్మశానంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ



అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పొదలకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న శ్మశానంలో గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని గమనించి న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముందుగా సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఎండీ.హనీఫ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకుని సమాధుల మధ్య రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. కాగా రంగంలోకి దిగిన క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లు వేలి ముద్రలు, వివరాలు సేకరిస్తున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మృతదేహం తలపై కోసిన ట్లు గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తుమన్నారు. హంతకులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదల మన్నారు.

మనుబోలు రైల్వే స్టేషన్ వద్ద యాచకుడు..



రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మనుబోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఓ గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెంది ఉం డడాన్ని స్థానికులు శనివారం గుర్తించి రైల్వే పోలీసులకు సమాచా రం అందించారు. అది తమ పరిధి కాదని రైల్వే పోలీసులు చెప్పడంతో సివిల్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతుడు నీలంరంగు జీన్స్‌ప్యాంటు, నల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడు. అతని పక్కన ఓ మూట ఉంది. చింపిరి జట్టు, అపరిశుభ్రంగా ఉండడంతో యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం తీరునుబట్టి ఫిట్స్ వచ్చి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంగపట్నం రోడ్డులో వ్యక్తి మృతదేహం



పురిణి వెంకటరమణయ్య మృతదేహం

ఇందుకూరుపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడు- గంగపట్నం రోడ్డులో మెకానిక్ షాప్ దగ్గర శనివారం పల్లెపాలెంకి చెందిన పురిని వెంకట రమణయ్య (45) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూ రు జీజీహెచ్‌కు తరలించారు.

అనునాస్పదంగా వృద్ధుడి మృతి

తోటపల్లిగూడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుకా నిపల్లి పంచాయతీ దళితకాలనీలో శనివారం అనుమనాస్పదంగా వ1ద్ధుడు మృతి చెందాడు.. పోలీసుల కథనం మేరకు.. దళిత కాలనీకి చెందిన గద్దె శేషయ్య(64) శుక్రవారం రాత్రి బహిర్భూమికి ఇంటి నుంచి సమీపంలో దొరువు వద్దకి వెళ్లాడు. అక్కడ ఏమి జరిగిందో ఏమోకాని ఉదయం పంచాయతీ దొరువులో శవమై కనిపించాడు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేంద్రబాబు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అయితే సంఘటా స్థలంలో సౌతు ఆములూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆధార్‌కార్డు, బ్యాంకు ఏటీఎం కార్డు లభ్యమైందని, ఆదిశగా విచారణ చేస్తున్నామని, త్వరలో వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..


నెల్లూరు(క్రైం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 30 నుంచి 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై మెరూన్, నలుపు రంగు చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు రంగుపై తెలుపు డిజైన్ షార్ట్ ఉన్నాయని తెలిపారు. కుడి చేతిపై ఆర్‌ఏకేయూ అని ఇంగ్లీషులో అక్షరాలు ముద్రించి ఉన్నాయని, మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలలతో భిక్షాటన

● 10 మంది పిల్లలు, 4 తల్లులు స్టేషన్‌కు తరలింపు

నెల్లూరు(క్రైం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న వారిపై శనివారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, చిన్న బజారు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పది మంది పిల్లలు, నలుగురు తల్లులను చిన్న బజారు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారందరూ గుంతకల్లు ప్రాంతం బెంచ్‌కోటకు చెందిన వారిగా గుర్తించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ చిన్నారులతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలలతో భిక్షాటన చేయిస్తే శిక్షిస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మనుబోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొమ్మలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుమలకు వెళ్లి స్వామి దర్శనం అనంతరం స్వగ్రామం ఒంగో లుకు బయలుదేరారు. ఈ క్రమంలో కొమ్మలపూడి క్రాస్ రోడు వద్ద ముందు వెళుతున్న వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వేగంగా వస్తున్న కారు అదుపు చేయలేక ఆ వాహన్నా ఢీకొంది. దీంతో కారులో ఉన్న కిరణ్‌కుమార్, సౌజన్యకు గాయాలు కాగా, చెన్నకేశవులు, లక్ష్మీకుమారి, ఇద్దరు చిన్నపిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 2 లక్షలిస్తే ఉద్యోగం!!

- ఆపై రెగ్యులర్ కూడా అవుతుంది
- భలే చాన్సు... వదులుకోవద్దు
- జీజీహెచ్‌లో ఓ అటెండర్ దందా
- డీఎంఈ సంతకం ఫోర్జరీతో నియామక ఉత్తర్వులు
- రూ.16 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు
- లబోదిబోమంటున్న బాధితులు

నెల్లూరు (వైద్యం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వ ఉద్యోగం... అది కూడా భలే చవకగా వస్తుంది.. రూ.2లక్షలిస్తే పోస్టు మీదే!.. పైగా రెండు నెలల్లో రెగ్యులర్ అవుతుంది.. ఇలాంటి అవకాశాన్ని వదులుకోవద్దు...' అంటూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అటెండర్‌గా పనిచేసే ఏ మురళి అనే వ్యక్తి నిరుద్యోగులకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు. అతని మాటలు నమ్మి కొందరు నిరుద్యోగులు రూ.16 లక్షలు సమర్పించుకున్నారు. ఏకంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సంతకంతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్లు వారి చేతికివ్వడం తో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆ లెటర్‌లో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌ను కలవాలని, వెంటనే పోస్టింగ్ ఇస్తారని నమ్మబలికారు. ఎంతో ఆనందించిన నిరుద్యోగులు సూపరింటెండెంట్‌ను కలవగా ఈ లెటర్ ఫోర్జరీ అని తేలింది. దీంతో ఏమి చేయాలో తెలియక బాధితులు లబోదిబోమం టూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు కేసు నమోదు చేయలేదు. అటెండర్ తీసుకున్న డబ్బును తిరిగి ఇచ్చేస్తామని అతని తల్లి చెప్పడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కానీ బాధితులకు ఇప్పటి వరకు డబ్బు చెల్లించక పోవటంతో మరోసారి జీజీహెచ్ సూపరింటెండెంట్ ను కలిసి న్యాయం చేయమని అభ్యర్థించారు.

మోసం పక్కాగా...

అటెండర్ మురళి ఉద్యోగాల పేరుతో పక్కా ప్రణాళికతో మోసానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. డీఎంఈ సంతకం ఫోర్జరీతో ఎనిమిది మంది నిరుద్యోగులకు అపాయింట్ లెటర్ ఇచ్చాడు. ఆరుగురికి జూనియర్ అసిస్టెం ట్లుగా, ఒకరికి ల్యాబ్ టెక్నీషియన్, మరొకరికి అటెండర్ పోస్టు ఇస్తున్నట్లు మాయ చేశాడు. రిజర్వేషన్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆ అపాయింట్ మెంట్ లెటర్‌లో పొందుపరిచాడు. జీతభత్యాలు కూడా నిర్ధారించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు... జిల్లా సెలక్షన్ కమిటీ సదరు నిరుద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చక్కగా లెటర్ రూపొందించాడు. గత ఏడాది నవంబరు 1న నోటిఫికేషన్ ఇచ్చినట్లు, డిసెంబరు 15న అభ్యర్థుల ఎంపిక జాబితా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపినట్లు అందులో పేర్కొనడం గమనార్హం.





ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిణీ



ఫేక్ అపాయింట్ మెంట్ లెటర్



ఆది నుంచీ వివాదాస్పదుడే!

ఉద్యోగస్తుడైన తండ్రి మరణించటంతో మురళికి అటెండరు ఉద్యోగం లభించింది. తొలుత డైరెక్టరీ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌లో అటెండర్‌గా చేరాడు. 2014 నుంచి వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తు న్నాడు. తొలినుంచి అతని తీరు వివాదాస్పదంగానే ఉన్నట్లు తెలిసింది. జల్సాలకు అలవాటు పడి పలువురి వాహనాలు కూడా కుదువ పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరళి కొంతకాలం క్రితం వైద్య కళాశాల నుంచి జీజీహెచ్‌లోని సర్జరీ విభాగానికి అటెండర్‌గా మారాడు. అయితే సక్రమంగా విధులకు హాజరు కాకపోవటంతో ఆ విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి తమకు ఆ అటెండరు సేవలు వద్దంటూ వైద్య కళాశాలకు సరెండర్ చేసినట్లు తెలిసింది.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశాడు

నా కూతురు అనూషకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని అటెండర్ మురళి నమ్మించాడు. రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. ఇప్పటికే వంతుల వారీగా రూ.1.50 లక్షలు ఇచ్చాను. డీఎంఈ పేరుమీద అపాయింట్‌మెంట్ లెటర్ కూడా ఇచ్చాడు. కాంట్రాక్టు ఉద్యోగమని మరో రెండు నెలల్లో పర్మినెంట్ అవుతుందని చెప్పాడు. మా తమ్ముడు కూతురు మాధురికి ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. తీరా విచారించగా మోసపోయామని తెలిసింది. ఫిబ్రవరి 7వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాము. తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేస్తామని మురళి తల్లి నమ్మబలకటంతో పోలీసులు కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అయితే ఇప్పటి వరకు డబ్బు చెల్లించలేదు.

- జాన్, బాధితురాలి తండ్రి



నేత్రదానం

నెల్లూరు (వైద్యం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయ పాళేనికి చెందిన విజయనగరం లోకేష్(25) శనివారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఈ నేత్రాలను సేకరించారు.



లోకేష్ (ఫైల్)

నేడు కృష్ణగాన మంజరి

దారుకృతి-తిల్లానాతో వినూత్న ప్రక్రియ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం పురమందిరంలో దారుకృతి తిల్లానాల తో వినూత్నంగా కృష్ణగాన మంజరి భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు భారతీయ సంగీత విద్యాలయం అధినేత ఏ రమాదేవి, దువ్వూరు బెజర్జీ, ఏవీఆర్ కిషోర్ తెలిపారు. తమ విద్యాలయం నుంచి వేలాది మంది సంప్రదాయ సంగీతం, సినీ సంగీతం, కర్ణాటక సంగీతాలలో అంతర్జాతీయ గుర్తింపు పొందారని చెప్పారు. కృష్ణగాన మంజరిలో ప్రముఖ వాగ్గేయకా రుల కృష్ణ భక్తి గీతాలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. విశిష్ట అతిథిగా కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు ముల్లైవాసనల్ డాక్టర్ జీ చంద్రమౌలీ హాజరవుతున్నారని, అలాగే నగర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమ బ్రోచర్లు విడుదల చేశారు.

యాళి వాహనంపై నీలకంఠేశ్వరుడు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోత) : నగరంలోని మూలాపేట అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి యాళి వాహనంపై ఉత్సవం కనుల పండువగా జరిగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు అనంతరం తిరుచ్చి ఉత్సవం జరిగాయి.

'రత్నం' నృత్య వార్షికోత్సవం

నెల్లూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జెన్ నెక్స్ట్ స్కూల్స్ ఆధ్వర్యంలో నగరంలోని ఐఎంఏ హాలులో కూచిపూడి, భరతనాట్య వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే క్రమంలో ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాదయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకి షోర్, వాసంతి, ఏవోలు తుహీనా, వాణి, సునీల్, ఖాసిం, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



10న రెడ్‌క్రాస్ భూమి లీజు వేలం

నెల్లూరు (వైద్యం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేట మండలంలోని రెడ్‌క్రాస్ పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ భూములను లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 10న వేలంపాట నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆశ్రమానికి చెందిన 2 ఎకరాల 14 సెంట్ల భూమిలో మామిడితోపాటు ఇతర ఫలవృక్షాలు, ఎకరా 37 సెంట్లలో కొబ్బరి మొక్కలు ఉన్నాయన్నారు. వాటి ఫలసాయముతోపాటు ఆయా చెట్ల మధ్యలో అంతర పంటలు సాగు చేసేందుకు మూడేళ్ల కాలపరిమితితో లీజు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాల్గొనదలచిన వారు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఈ నెల 9లోపు ధరావతు సొమ్ము రూ.5వేలు చెల్లించి రసీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9640027128 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పీసీ రాణికి డైమండ్ సిల్వర్ ఉమెన్ అవార్డు 2025



పురస్కారం అందుకుంటున్న రాణి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిని పీసీ రాణి ప్రతిష్ఠాత్మక డైమండ్ సిల్వర్ ఉమెన్ అవార్డు-2025ను అందుకున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా హ్యూమన్ కేర్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థలు ఈ అవార్డును ప్రదానం చేశాయి. శనివారం బెంగళూరులో జరిగిన సభలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం రంగనాయకుల పేట పీఎంఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రిని అందజేశారు. విద్యార్థి జీవితంలో 10వ తరగతి మైలు రాయి వంటిదని, ప్రతి ఒక్కరు పరీక్షలు జాగ్రత్తగా రాసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణ, నటుడు, దర్శకుడు సింగంశెట్టి మురళి, ఏ జయప్రకాష్, ప్రముఖ ఇంద్రజాలకుడు ఏకే రాయలు, ఉపాధ్యాయులు వీ వెంకటేశ్వర్లు, వసుమతి, గోవర్ధన్, నాగరాజు, త్యాగరాజు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి.

పాండురంగ ఆనంద అగ్నిగుండ మహోత్సవం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సాయిదర్బార్ మందిరం ఆధ్వర్యంలో బాలాజీనగర్ సాయి మాత నిత్య అన్నదాన ప్రసాదాలయం వద్ద పాండురంగ స్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవం శనివారం తెల్లవారుజామున ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవంలో పాల్గొనే పండరి భజన, కోలాట భజన గురువులు, కళాకారులు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో సముద్ర స్నానం ఆచరించారు. అనంతరం కంకణ ధారణ చేసుకుని తుకారామ్ జెండా ధ్వజ ఆరోహణ చేశారు. అగ్ని గుండాన్ని అగ్ని ప్రతిష్ఠ చేశారు. తర్వాత సంగీత వాయిద్యాలతో పండరి భజన, కోలాట నృత్యాలు ప్రారంభించారు. పాండురంగ స్వామి భక్తిగీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీకృష్ణలీలల్ని పండరి భజనల్లో ప్రదర్శిస్తారు. అనంతరం ఉగ్రనరసింహస్వామి దండకంతో గురువులు, కళాకారులు అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. ఈ కార్యక్రమానికి వాయిద్య సహకారం, డోలు మాస్టర్ జీ ప్రభాకర్, జీ నాయబ్, కీబోర్డు కే సూరిబాబు, క్లార్నెట్ హనుమంతరావు అందించారు. ఈ కార్యక్రమాలను సాయిదర్బార్ గౌరవ సలహాదారుడు పాబోలు రామసుబ్బయ్య, సాయిదర్బార్ సత్సంగ సేవాదళ్ సభ్యులు మధుసాయి పర్యవేక్షించారు.

జిల్లాస్థాయి పోటీల్లో ఎంపీపీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సీతారామపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విభావర్ద్ పవర్ ఛాంపియన్స్ ఆధ్వర్యంలో జిలాస్థాయిలో జరిగిన పోటీలలో ఎంపీపీ స్పెషల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీలలో భాగంగా ఇంగ్లీషు లిటరసీ ప్రోగ్రాం లో షేక్ అలీఅల్ఫాజ్ మొదటి బహుమతి సాధించగా, సయ్యద్ మహ్మద్ సాబీర్, ఒక్కా సాత్విక మండల స్థాయి ఛాంపియన్స్‌గా గెలుపొందారు. స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

ప్రతీ నెలా పింఛన్ల పండుగ

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ప్రతీనెల ఒకటో తేదీ రాగానే రాష్ట్రంలో పింఛన్ల పండుగ వాతావరణం ఏర్పడుతోందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందచేశారు. స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కోటిగా నెరవేర్చే క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు చెప్పారు.

రంజాన్ నెలలో లోపాలు రానివ్వద్దు

పవిత్ర రంజాన్ మాసంలో నగరంలోని మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, లోపాలు రానివ్వొద్దని మంత్రి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ముస్లిం మతపెద్దలు, అధికారులతో ఆయన శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులు సమీక్షించారు. నగరంలో రకరకాల అవసరాల నిమిత్తం ముస్లింలు బయటకొచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రాత్రి 12 గంటల వరకు దుకాణాల నిర్వహణకు సమయం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

బయో మైనింగ్ పనులకు శంకుస్థాపన



వృద్ధురాలికి పింఛన్ నగదు అందచేస్తున్న మంత్రి నారాయణ

నగరంలోని చెత్తంతా అల్లీపురం డంపింగ్ యార్డుకు చేరుతుంది. దానిని బయో మైనింగ్‌కు తరలించేందుకు చేపట్టిన పనులకు అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద మంత్రి నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను తమ ప్రభుత్వానికి అంటగట్టి వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని అన్నీ మున్సిపాలిటీల్లో ప్రజలు చెల్లించే పన్నులను ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికే కేటాయి స్తామని తెలిపారు. రోడ్లను శుభ్రం చేసేందుకు యంత్రాలను వినియోగం లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రానున్న ఆరు నెలల్లో డంపింగ్ యార్డుల్లోని చెత్తను పూర్తిగా తొలగించి పచ్చదనం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ సూర్యతేజ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్ యాదవ్, తహసీన్, నాయకులు పాల్గొన్నారు.

'నారాయణ'లో జాతీయ సదస్సు

నెల్లూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ ఫెస్ట్ పేరుతో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. శుక్ర, శనివారాలు జరిగిన ఈ సదస్సులో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, కోడింగ్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్ ఫన్ ఈవెంట్స్, బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్ తదితర ఈవెంట్స్ నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పీడీ టీ వేణుగోపాల్ హాజరయ్యారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించడంతో పాటు దేశాభ్యున్నతికి సహకరించే ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. వీఎస్‌యూ ఎంబీఏ హెడ్ ఆచార్య సుజానాయర్ మాట్లాడు తూ యువత ధృడ సంకల్పంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని దిశాని ర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాపోటీలు నిర్వహిం చి బహుమ తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రతినిధులు

మురుగునీటి నివారణకు శాశ్వత చర్యలు తీసుకోండి

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్లెక్కుతున్న మురుగునీటి సమస్య నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శనివారం 5వ డివిజన్ సత్యనారాయణపురం, వైంకుంఠపురం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డ్రైన్లలో మురుగునీటి పారుదల సాఫీగా సాగేలా చూడాలన్నారు. మురుగు కాలువల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. అనంతరం మరిన్ని ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనుల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



రోడ్డుపైన నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

'నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

నెల్లూరు (హరనాథపురం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో మూడు రోజుల కిందట దళిత మహిళ నెల్లూరు బుజ్జమ్మపై దాడి చేసిన అంబూరు కామాక్షయ్య, వెంకటేశ్వర్లుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. నగరంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైస్ మిల్లులో గుమస్తాగా పని చేస్తున్న బుజ్జమ్మపై బియ్యం దళారీ కామాక్షయ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో పైశాచికంగా దాడి చేశారన్నారు. నిందితుల పై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామన్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని సుబ్బయ్య ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. రాష్ట్రంలోనూ వర్గీకరణను పూర్తి చేసి, ఆ తర్వాతే డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం నాయకులు డేగా రాఘవేంద్ర, విజయ్‌కుమార్, ఆనంద్‌రావు, పలిగిలి చెన్నయ్య, డానియల్, అమర్‌నాథ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

'సామ్నా' నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ (సామ్నా) జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉయ్యాల విజయకుమార్, ఉపాధ్యక్షుడు పాజర్ల ప్రదీప్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ సీహెచ్ తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా చంద్రకాంత్‌ను నియమించారు. ఈ సమావేశంలో సామ్నా అధ్యక్షుడు వేలూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చంక్రం దినేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ట్రెజరర్ సునీల్ గవాస్కర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి హనోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

న్యూస్ బాక్స్

అవినీతికి ఆస్కారం లేదు : ఇంజనీర్లు

నెల్లూరు(సిటీ), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతికి అస్కారంలేదని ఆ విభాగం ఇంజనీర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. నగరంలో పనులు అన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయ ని, క్వాలిటీ కంట్రోల్ నివేదిక అనంతరమే బిల్లులు మంజూరు చేస్తారని వెల్లడించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారి వివరాలు స్వయంగా కమిషనర్‌కు అందచేయవచ్చని ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలు సంయుక్తంగా ఆ ప్రకటనలో తెలిపారు.

పింఛన్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన వీరమహిళలు పాల్గొన్నారు. గునుకుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు.

వైసీపీని నమ్మే పరిస్థితి లేదు : ధర్మవరం

నెల్లూరు (వైద్యం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 47వ డివిజన్‌లో ఆయన పంపిణీ చేశారు. ప్రతీనెల ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్న చరిత్ర రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్, కలవకుంట్ల భాస్కర్, కంచికృష్ణ, మునికృష్ణ, వీరమల్లు చంద్ర నాగలక్ష్మి, మధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 19వ డివిజన్ రామలింగాపురం వద్ద సీసీ రోడ్ల పనులకు శనివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.4.37 కోట్ల పనులు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జ్యోతి ప్రియ, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్ రెడ్డి, సినీ నిర్మాత చిట్టమూరు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జానా శీనయ్య రమేష్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వండి

నెల్లూరు(సిటీ), మార్చి 1(ఆంధ్రజ్యోతి) : కార్పొరే షన్‌లో పనిచేస్తున్న కార్మికు లందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని వెహికల్ షెడ్ వద్ద ధర్నా చేశారు. నాయకుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల శ్రమ ను ప్రభుత్వమే దోచుకుంటోందని ఆరోపించారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని, ఏళ్ల తరబడి ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

జనార్దన్‌రెడ్డి కాలనీ ఔట్‌పోస్టు పరిశీలన

నెల్లూరు(క్రైం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోలీసు ఔట్ పోస్టును నగర డీఎస్పీ సింధుప్రియ శనివారం రాత్రి పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఔట్ పోస్టు ప్రాధాన్యతను డీఎస్పీకి వివరించారు. నేరాల కట్టడికి ఈ పోస్టు ఎంతగానో ఉపయోగ పడుతుందని సింధుప్రియ పేర్కొన్నారు.



ప్రజావేదిక గ్రామసభకు హాజరైన జనం

టీడీపీ సమావేశంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

కార్యకర్తలను చూస్తే కొండంత ధైర్యం

2019 ఎన్నికల్లో ఓటమికి వారిలో అసంతృప్తే కారణం

కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు అందుబాటులో ఉండాలి

టీడీపీ శ్రేణుల సమావేశంలో చంద్రబాబు

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం వస్తుంది. 8 నెలలుగా పాలనలో నిమగ్నమై పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయా. మళ్లీ కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉంది' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు.గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో వాసు, వసంతమ్మలకు ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీకాలనీలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు.అక్కడే ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ప్రసంగించాక సమీపంలోని రామానాయుడుపల్లె వద్ద శనివారం మండల టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '30 ఏళ్ల తర్వాత గంగాధరనెల్లూరులో టీడీపీ జెండా ఎగరేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గాన్ని పార్టీకి కంచుకోటగా మార్చాలి. తంబళ్లపల్లె, పుంగనూరులో కాస్త గురి తప్పాం.. తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలో కూడా మనమే గెలిచేవాళ్లం. 2014-19 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్‌రేట్ సాధించాం. అయినా ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు.. కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అణువణువూ పసుపు రక్తం తప్ప మరోటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటే నాపై అసంతృప్తి చెందుతారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేయించా. ఇక నుంచి నాకూ,కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలతో సమావేశమవుతా' అన్నారు.ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలతో అనుసంధానం కావడంతో పాటు కార్యకర్తలకూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. వన్‌టైమ్ ఎంపీ, ఎమ్మెల్యేగా భావించకుండా రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండేలా పనిచేయాలని ఉద్బోధించారు.వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఉపకారం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు.వారికి ఉపకారం చేయడమంటే పాముకు పాలు పోసినట్లే. అని గుర్తించాల న్నారు.టీడీపీ శ్రేణులు కూడా ఇష్టానుసారంగా కాకుండా నాయకత్వం కింద పనిచేయాలని సూచించారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న అభిమానులు









2 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

● గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు వరాలు

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు-తచ్చూరు హైవే పూర్తయితే చెన్నైకి 45నిమిషాల్లో, బెంగళూరుకు ఒకటిన్నర గంటలో వెళ్లిపోవచ్చు. దానికి అనుగుణంగా చిత్తూరు-తచ్చూరు హైవే సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 2 వేల ఎకరాలను సేకరించమని కలెక్టర్‌కు చెప్పా. బయటి ప్రాంతాల నుంచి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ నిరుద్యోగ సమస్య తీరుస్తా' అని సీఎం చంద్రబాబు ప్రజావేదిక పేరుతో ఏర్పాటు చేసిన గ్రామసభలో హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టులను అనుసంధానం చేసి సాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, హార్టికల్చర్ పంటలు పెరిగిన నేపథ్యంలో మామిడి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి సౌకర్యాలను పెంచుతామన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు థామస్, అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్,టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ పాల్గొన్నారు.

అవీ ఇవీ

● టీడీపీ కార్యకర్తల సమావేశంలో చివరగా క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిలో కృషి చేసిన శ్రేణుల పేర్లను చంద్రబాబు చదివి అభినందించడంతో చప్పట్లతో సమావేశం మార్మోగిపోయింది.

● హెలిప్యాడ్‌లో ఎమ్మెల్యే థామస్ తన ఇద్దరు కుమారులను చంద్రబాబుకు పరిచయం చేశారు.

● పెన్షన్ల పంపిణీతో పాటు సెల్వి అనే మహిళతో పాటు ఆమె మనవరాళ్ల చదువుకు, సొంతింటికి ఆర్థిక సాయం చేయడం, ప్రజావేదికలో పాల్గొనడం గురించి సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో ఫొటోలతో సహా పోస్టు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు.

● టీడీపీ కార్యకర్తల మీటింగులో వేదిక మీద ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే థామస్, పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లతో పాటు గతంలో నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పనిచేసిన భీమసేని చిట్టిబాబుకు కూడా అవకాశం దక్కింది.

● చంద్రబాబు బస్సులో వుండగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు లోపలికెళ్లి కాసేపు మాట్లాడారు.

● హెలిప్యాడ్‌లో ఎల్1, ఎల్2 విభాగాల్లో టీడీపీ నాయకులు ప్రాధాన్యతను బట్టి సీఎం చంద్రబాబును కలిశారు. ఎల్1లో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు కలవగా.. అందరి భుజాలపై చేతులేసి చంద్రబాబు పేర్లతో పలకరించడంతో వారంతా మురిసిపోయారు.



కళ్యాణం.. కమనీయం

● వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక

● తరలివచ్చిన భక్తజనం

● ఒక్కటైన 41 జంటలు

నేటి వాహన సేవలు — ఉదయం: బనాత అంబారీ వాహన సేవ; రాత్రి: అశ్వ, సింహ వాహనసేవలు

శ్రీకాళహస్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనంత విశ్వమే పందిరిగా... ఆచంద్రతారలే అలంకారాలుగా... భూమండలమే వివాహ వేదికగా... పంచభూతాల సాక్షిగా... అష్టదిక్కులు, ముల్లోకాల నుంచి ముక్కోటి దేవతాగణాలు వీక్షిస్తుండగా... అశేష భక్తజన వాహిని మధ్య శనివారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరుడు మాంగల్యధారణ చేశారు. ఇదే శుభ ఘడియలో ఆది దంపతుల సమక్షంలో 41 జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యాయి. వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. అంతకు మునుపు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల ఆటలు, పాటల మధ్య ఆది దంపతులు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. మొదట పరమేశ్వరుడు చేరుకోవడంతో పార్వతీదేవి అలకబూనారు. చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం నిర్వహించి అమ్మవారి అలక తీర్చారు. గంగాధరుడు, శివానీ పెళ్లిపీటలపై ఆసీనులయ్యారు. వేదపండితులు కలశ స్థాపన చేశారు. సంకల్పం, యజ్ఞాహుతి పూజలు పూర్తి చేశారు. పూజల అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణలు చేస్తూ ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కల్యాణం వీక్షించడానికి పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనం తరలివచ్చారు. నగరి వీధి, నెహ్రూ వీధి భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.



నేడు కైలాసగిరి ప్రదక్షిణ

మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించి ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. అన్న ప్రసాదాలు, తాగునీరు, పండ్లు, మజ్జిగ అందుబాటులో పెట్టనున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● 820 మంది గైర్హాజరు



తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడి యట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సర లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. 8.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. మెటల్ డిటెక్టర్లతో నిశితంగా తనిఖీ చేశారు. సెల్‌ఫోన్లు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. జిల్లాలో 86 పరీక్ష కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 15 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు డీఈసీ మెంబర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ కనిపించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 33,164 మందికి గాను 820 మంది గైర్హాజరయ్యారని ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ ఎస్పీ హర్షవర్ధనరాజు, ఆర్‌ఐఓ నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. సోమవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.24

సహారి (సోమవారం) : 5.10



తిరుమలేశుడి సేవలో
నటి మెహరీన్

సినీ నటి మెహరీన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. సుప్రభాత పఠనం పూర్తికాగానే గర్భాలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ఆలయం ముందు మెహరీన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో
నటి హన్సిక



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సినీ నటి హన్సిక దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నేడు స్థానికుల దర్శన కోటా టోకెన్ల జారీ

ప్రతినెలా మొదటి మంగళవారం తిరుపతి, తిరుమల స్థానికులకు కల్పించే శ్రీవారి దర్శన కోటా టోకెన్లను టీటీడీ ఆదివారం జారీ చేయనుంది. ఈ నెల 4వ తేదీన టీటీడీ స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి వాసులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన ఆదివారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానికులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.24 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 52,731

తలనీలాలు సమర్పించినవారు: 17,664





పెరిగిన మల్బరీ తోట

సెరికల్చర్‌తో లాభాల సిరి
పుత్తూరు మండలంలో పెరుగుతున్న సాగు

మనసుంటే మార్గం ఉంటుందంటారు. పుత్తూరు మండలంలో కొంతమంది రైతుల సాగుతీరు పరిశీలిస్తే ఈమాట అక్షరాలా నిజం. ఏటా సంప్రదాయ పంటలే సాగుచేయడం, నష్టాలను చవిచూడడం చాలామంది రైతులకు అలవాటు. దీని నుంచి బయటపడటానికి ఆసక్తి చూపించరు. ఫలితంగా ఏటేటా నష్టాలను మూటగట్టుకుంటారు. కానీ గొల్లపల్లి, రామకృష్ణాపురం, కొండల్‌చెరువు గ్రామాల్లో కొందరు రైతులు భిన్నంగా ఆలోచించారు. కొత్త ఒరవడికి స్వాగతం పలికారు. నష్టాల భారాన్ని దించుకున్నారు. నెమ్మదిగా లాభాలబాట పట్టారు. ఈ రైతుల బతుకుల్లో ఆనందాల సిరులు పంచుతున్నది సెరికల్చర్ సాగు.

-పుత్తూరు,ఆంధ్రజ్యోతి

పుత్తూరు మండలంలో వాస్తవానికి సెరికల్చర్ (మల్బరీ లేక పట్టుగూళ్లు)కు 1978లోనే అడుగులు పడ్డాయి. నాటి ఎమ్మెల్యే కేబీ సిద్ధయ్య రాష్ట్ర సెరికల్చర్ బోర్డు చైర్మన్‌గా నియమితులయ్యాక కరువుకాటకాల్లో మునిగి తేలుతున్న రైతులకు సెరికల్చర్ ప్రత్యామ్నాయ మార్గమని నమ్మి ఈ సాగును పరిచయం చేశారు. దీంతో పలువురు రైతులు పట్టుగూళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. లాభాలను తొలిసారిగా రుచి చూశారు. అయితే కాలక్రమేణా ఈ రంగానికి ప్రోత్సాహం కొరవడడంతో రైతులు మళ్లీ పాత పంటల సాగుకే మొగ్గు చూపారు. అయితే కొన్నాళ్లుగా సెరికల్చర్‌కు ప్రభుత్వం నుంచి చేయూత పెరిగింది. ఫలితంగా రైతులు పట్టుపురుగుల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. మామిడి, వరి, చెరకు వంటి పంటల సాగుతో చేతులు కాల్చుకుంటున్నామని గ్రహించి మల్బరీ వైపు చూస్తున్నారు.



గూళ్లను ఏరుతున్న కూలీలు



షెడ్డులో బెడ్డులు

సాగు విధానమిలా..

పొలాన్ని దుక్కి దున్ని మల్బరీ కొమ్మలను బోదెల్లో నాటాలి. ఎక్కువ నీరు అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు, వేపనూనెను వినియోగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించాలి. షెడ్డును, లోపల ఇనుప స్తంభాలతో మూడు లేక నాలుగు అంచెల బెడ్లు నిర్మించుకోవాలి. షెడ్డులో ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు వేసవిలో నీడనిచ్చే చెట్లు చుట్టుపక్కలా పెంచాలి. శీతాకాలంలో కిటికీలను గోనె సంచులతో మూసివేయాలి. ఉష్ణోగ్రత గుర్తించేందుకు షెడ్డులో కొలమానిని వుంచుకోవాలి. మల్బరీ చెట్లు ఏపుగా పెరిగాక అయిదు రోజుల పట్టు పురుగులను (చాకీ సెంటర్) పెంపకందారుల నుంచి తీసుకువస్తారు. ఎకరానికి 125 గుడ్లను తీసుకుంటే నూగు గింజల సైజులో గుడ్డునుంచి సగటున 600 పురుగులుంటాయి. వీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచి షెడ్డులోని బెడ్డు మీద చేర్చాలి. రెండు పూటలా మల్బరీ ఆకులను కత్తిరించి పురుగులకు ఆహారంగా వేయాలి. పురుగు సైజు పెరిగే కొద్దీ మల్బరీ ఆకు కొమ్మలను బెడ్డు మీద ముందుకు జరుపుతూపోవాలి. పట్టు గూళ్లు తయారయ్యే ఇరవై రోజుల వ్యవధిలో మూడు సార్లు నిద్రావస్థ (జ్వరం) సమయంలో పురుగు ఆహారం తీసుకోదు. సైజు పెరగని పురుగులను పరిశీలిస్తూ తొలగించాలి. 20 రోజుల తర్వాత వలలో పెట్టిన గూళ్లను సేకరించి బాక్సులతో మార్కెట్‌కు చేరవేయాలి. ధరను బట్టి కిలోల లెక్కన అధికారులు ఈ బాక్స్‌లను వ్యాపారులకు అప్పజెప్పి మర్నాడే నగదును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. పంట పూర్తయ్యాక షెడ్డును శుభ్రపరిచి మరో పంటకు సమాయత్తం కావాలి.

తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలు



సాధారణంగా ఏడాదికి తొమ్మిది పంటలు తీసుకోవచ్చు. తక్కువ వ్యవధిలోనే సాగుకు వీలున్న పంట ఇది. ఎకరాకు దాదాపు రూ.5 లక్షలు ఆర్జిస్తున్నట్లు కొందరు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పుత్తూరు మండలంలో 30 ఎకరాలకుపైగా మల్బరీ సాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది.

- శిరీష, సెరికల్చర్ అధికారిణి

మరింత ప్రోత్సాహం అవసరం



ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో పాటు మరిన్ని వసతులను కల్పిస్తే సాగు ఖర్చులు తగ్గి రాబడి పెరుగుతుంది. షెడ్డు, బెడ్లు, వలలకు సబ్సిడీ అందుతోంది. మల్బరీ మొక్కల సాగు, ఆకుల కత్తిరింపులో పెట్టుబడుల ఖర్చును తగ్గించేందుకు చిన్న ట్రాక్టర్లు, కట్టర్లు, వేపనూనె, బ్లీచింగు పౌడరు, సున్నం వంటి వాటిని ప్రభుత్వం అందిస్తే బాగుంటుంది.పలమనేరు,మదనపల్లెలతో పాటు మరికొన్ని చోట్ల పట్టు గూళ్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి.

- మునిబాలకృష్ణయ్య,గొల్లపల్లి

గాజులమండ్యం నుంచి శ్రీసిటీ మీదుగా తడకు కొత్త రోడ్డు

- గతేడాది సీఎం ఆదేశాలతో తాజాగా సర్వేకు నిర్ణయం
- అధ్యయనానికి రూ.1.775 కోట్లు మంజూరు

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా రోడ్డు సదుపాయం కల్పించాలంటూ గతేడాది సీఎం నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చేసిన ఆదేశం ఇపుడు కార్యరూపం దాల్చుతోంది.అందులో భాగంగా రోడ్డు నిర్మాణంపై డీపీఆర్ రూపొందించేందుకు ప్రభుత్వం తాజాగా రూ.1.775 కోట్లు మంజూరు చేసింది. డీపీఆర్ రూపొందించే కన్సల్టెన్సీని ఎంపిక చేయాల్సిందిగా ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.గతేడాది నవంబరులో సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లికి వచ్చిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చించారు. ఆ సమయంలో ప్రత్యేకించి జిల్లాలో కొన్ని కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించి సూచనలు చేశారు. వాటిలో రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా శ్రీసిటీకి రోడ్డు నిర్మించాలనేది ఒకటి. ఇప్పటివరకూ ఎయిర్‌పోర్టు నుంచి లేదా తిరుపతి నుంచి శ్రీసిటీ చేరుకోవడానికి శ్రీకాళహస్తి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ కూడా ఇబ్బందికరంగా ఉంటోంది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు,దేశ విదేశాలకు చెందిన ప్రభుత్వాల, పరిశ్రమల ప్రతినిధులు తరచూ శ్రీసిటీని సందర్శిస్తున్న నేపథ్యంలో వారికి రాకపోకలు సుగమం చేయాలని సీఎం సూచించారు. దానికోసం రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా కనెక్టివిటీ ఉండేలా కొత్తగా రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని సీఎం సూచించారు.దీనిపై జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలసి ప్రాథమిక అధ్యయనం చేసిన కలెక్టర్ విమానాశ్రయానికి చేరువగా ఉన్న ఎన్‌హెచ్ 716పై గాజులమండ్యం నుంచి గుడిమల్లం, కాట్రపల్లి, శ్రీసిటీల మీదుగా తడలోని కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి అయిన ఎన్‌హెచ్-16ను కలుపుతూ కొత్త రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీలు సమీక్షించి రోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీని నియమించి డీపీఆర్ రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు.దానికోసం రూ.1.775కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ప్రభుత్వం రూ.1.775కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ రోడ్డు నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ రూపొందించేందుకు ఓపెన్ కాంపిటిటివ్ బిడ్డింగ్ పిలిచి కన్సల్టెన్సీని ఎంపిక చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది.ఇది పూర్తయితే జిల్లాలో రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి ఇదో ప్రధాన మలుపు కానుంది.

శ్రీసిటీలో షార్ 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

శ్రీసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్రోకు సంబంధించిన సమాచారంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా శ్రీసిటీ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో శ్రీసిటీలో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్ర, శనివారాల్లో సాగిన ప్రదర్శనలో స్థానిక ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్‌ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. అవకాశం కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, షార్ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో బృందం ఇస్రోకు సంబంధించిన వివిధ ప్రయోగాలను విద్యార్థులకు అవగాహన కలిగేలా వివరించారు.



నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

పుత్తూరు మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఫిర్యాదు
- పురపాలక శాఖ ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో దర్యాప్తు

పుత్తూరు అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్యకాలంలో రూ.కోట్లలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక శాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ విశ్వనాథ్ నేతృత్వంలో విచారణకు కమిటీ నియమించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో కమిటీ గోప్యంగా విచారణ కొనసాగిస్తోంది. కమిషనర్ వెంట్రామిరెడ్డి హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై దృష్టి సారించింది. అందుకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేస్తున్నారు. 2021మే 18వ తేదీన కుంగిన ఎస్ఎస్ ట్యాంకు కట్ట మరమ్మతులకు రూ.5లక్షలైనా ఖర్చవలేదు. కానీ సాధారణ నిధుల నుంచి రూ.12లక్షలు ఖర్చు అయినట్లు బిల్లులు పెట్టారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు కాంట్రాక్టరుకు అప్పగించాక సాధారణ నిధుల నుంచి డబ్బు డ్రా చేయడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. మూలనపడ్డ వాహనాల విక్రయాల్లో జరిగిన అక్రమాలపైనా విచారణ జరుపుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యంగా బిల్లులు ఆమోదం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో విచారణ ద్వారా నిజాలు నిగ్గుతేల్చనున్నారు. ఆదివారమూ విచారణ కొనసాగనుంది.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు చేస్తూ..
గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి



జగన్మోహనాచార్యులు (ఫైల్)

సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందారు. తిరుపతిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి.హోటల్‌ను బాంబులతో పేల్చివేస్తామని హెచ్చరిస్తూ మేనేజర్‌కు మెయిల్ రావడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. మెయిల్ ఐడీని తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణకు పంపారు. ఆయన బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి హోటల్లో అణువణువునా తనిఖీలు చేశారు. అన్ని గదులు, రిసెప్షన్, వంటగదులు, వాష్‌రూములు, మేనేజర్ చాంబర్‌ను తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలూ లేవని నిర్ధారించారు. దీంతో హోటల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టీడీపీ నేతల నడుమ 'మట్టి' యుద్ధం

- ఓ వర్గం అక్రమ తవ్వకాలపై మరో వర్గం ఫిర్యాదు
- నాలుగు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ఓ నేత జోక్యంతో రెండింటి విడుదల... మరో నేత ఒత్తిడితో తిరిగి స్వాధీనం
- ఈసారి నాలుగింటినీ విడిపించుకెళ్లిన వైనం
- గాజులమండ్యం స్టేషన్‌లో వారం రోజులుగా పంచాయితీ

రేణిగుంట,మార్చి1(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలో కొందరు టీడీపీ నేతల నడుమ మట్టి యుద్ధం నడుస్తోంది. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ వేదికగా వారం రోజుల నుంచి సాగుతున్న ఆధిపత్య పోరు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆదివారం రాత్రి మండలంలోని కొ్ట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడొకరు నాలుగు టిప్పర్లలో గాజులమండ్యం చెరువు నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. గాజులమండ్యం గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఆయన అనుచరులు గాజులమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు వచ్చిన పోలీసులు మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి దందా చేపట్టిన నాయకుడు మండల స్థాయి నేతను ఆశ్రయించారు. ఆ నేత సోమవారం ఉదయం గాజులమండ్యం స్టేషన్‌కు వెళ్లి అక్కడున్న నాలుగు టిప్పర్లలో రెండింటిని విడిపించి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం టీడీపీ నేత నేరుగా పోలీసు స్టేషన్ చేరుకుని పట్టుకున్న టిప్పర్లను ఎలా విడిచిపెట్టారంటూ సిబ్బందిని నిలదీశారు. దీంతో పోలీసులు హడావిడిగా ఆ టిప్పర్లను మళ్లీ స్టేషన్‌కు రప్పించారు. తాను విడిపించిన టిప్పర్లను పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారని తెలుసుకున్న మండల స్థాయి నేత పోలీసులపై ఒత్తిడి తెచ్చి సాయంత్రానికల్లా మొత్తం నాలుగు టిప్పర్లనూ విడిపించేశారు. కేసు నమోదు చేయకపోగా పట్టుకున్న నాలుగు టిప్పర్లనూ విడిచిపెట్టేయడంతో గాజులమండ్యం టీడీపీ నేత, ఆయన అనుచరులు మండిపడుతున్నారు. టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాల్సిందేనంటూ గాజులమండ్యం పోలీసులపై భీష్మించుకున్నారు. దీంతో పోలీసులు ఇపుడు టిప్పర్లు తీసుకొచ్చి స్టేషన్ వద్ద పెట్టండంటూ మండల స్థాయి నేతను బతిమాలుకుంటున్నారు. వారం రోజులుగా పంచాయతీ జరుగుతున్నా టీడీపీలోని రెండు వర్గాల్లో ఏ వర్గమూ వెనక్కు తగ్గడం లేదు. మట్టి దందా చేపట్టిన కొట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడు తనకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారమిచ్చి, కేసు నమోదుకు పట్టుబట్టిన నేతకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం రాత్రి పది గంటలకు నాలుగు లారీలను పోలీస్‌స్టేషన్‌లో తీసుకొచ్చి పెట్టారు. ఈ వ్యవహారం మండల టీడీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. కాగా ఈ వ్యవహారంపై రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. విచారించి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించండి

- కేంద్రమంత్రికి టీటీడీ చైర్మన్ లేఖ

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల పుణ్యక్షేత్రంపై విమానాలు ఎగరకుండా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాశారు. ఆగమశాస్త్ర నిబంధనలు, ఆలయ పవిత్రత, భద్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ప్రకటించాలని కోరారు. తిరుమల కొండపై తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వైమానిక కార్యకలాపాలతో శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న పవిత్రమైన వాతావరణానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. తక్షణం ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో మొదటిస్థానం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటిస్థానం దక్కింది. 2,62,461 మందికి గాను తొలిరోజైన శనివారం 2,53,656 మందికి (96.65 శాతం) పంపిణీ చేశారు. రూ.107.03 కోట్లను 5,800 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలో పాల్గొన్నారు. జిల్లాకు మొదటి స్థానం దక్కడంపై డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి, ఇతర ఉద్యోగులను ఆయన అభినందించారు.



వేదాంతపురం పంచాయతీలో పింఛను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గొలుసు దొంగ అరెస్ట్

- 170 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ

నాయుడుపేట టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలోని బంగారు సరుడును అపహరించే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ చెంచుబాబు మీడియాకు వివరాలను వెల్లడించారు. నాయుడుపేట పొగగొట్టం కాలనీకి చెందిన భవానీశంకర్ డిప్లమో పూర్తి చేశాడు. జులాయిగా తిరుగుతూ సులభ సంపాదనకు చోరీలను ఎంచుకున్నాడు. బైక్‌లో తిరుగుతూ ఇంటిముందు ముగ్గులు వేసే, వాకింగ్ చేసే మహిళల మెడలో బంగారు సరుడును లాక్కుని పరారయ్యేవాడు. పోలీసులు నిఘా పెట్టి, శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.12లక్షల విలువచేసే 170 గ్రాముల బంగారు అభరణాలు రికవరీ చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ బాబీ ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బందిని అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



గూడూరులో హాల్‌టిక్కెట్ నంబర్లను పరిచూసుకుంటున్న విద్యార్థులు

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్‌మేరీస్, డీఆర్‌డబ్ల్యూ, స్వర్ణాంధ్ర భారతి, నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఐదు కేంద్రాల్లో 1511 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 57 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. నారాయణ కళాశాల, ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విక్రమ్, అంబేడ్కర్ ఏపీఎస్ డబ్ల్యూఆర్ బాలికల కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. మూడు సెంటర్లలో 338 మంది విద్యార్థులకు గాను 323 మంది పరీక్షలకు హాజరయ్యారు. జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ నరసింహారావు తనిఖీ చేశారు. ఆయన వెంట డీవో సుబ్బారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ ఉన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల, ఏపీ ఆర్‌ఎస్ కళాశాల, బీఎన్‌ఎస్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మూడు కేంద్రాల్లో మొత్తం 1219 మంది విద్యార్థులకు 57 మంది గైర్హాజర య్యారని కస్టోడియన్ రవీంద్రబాబు తెలిపారు.

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకుల కళాశాలలో 197 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరు అయ్యారు.

వాకాడు: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 19 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఆర్ట్స్ కళాశాల, కోటలోని అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

అర్హులందరికీ పింఛన్లు: కురుగొండ్ల



వెంకటగిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని మందలిల్లు, కలివేలమ్మ వీధి, చాకలిపేట ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్, మల్లారం బాబు, నరిసింహులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్ గిరిజన కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, రాజశేఖర్, శ్రీధర్, కొండలరావు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని సొసైటీ కాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని చెన్నూరులో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. హేమ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలిలో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో విజయలక్ష్మి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కస్తూరయ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ దయాకర్‌రావు

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని హౌసింగ్‌శాఖ పీడీ దయాకర్‌రావు అన్నారు. శనివారం స్థానిక హౌసింగ్‌శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇల్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాయన్నారు. అదేవిధంగా 2016-17 నుంచి ఇంటి పనులు చేపట్టిన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా గృహ నిర్మాణం పూర్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. గతంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేసేవారని, నిర్మాణాలను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అదనంగా ఎస్సీలకు రూ. 50వేలు, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మంజూరు చేస్తోందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ సిబ్బందికి పీడీ సూచించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసులు, డీఈ షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గూడూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందని, దీనిని నివారించేందుకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగు తోందన్నారు.

వాకాడు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా మార్చి నెలాఖరు వరకు టీకాలు వేస్తామని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రమణయ్య తెలిపారు. శనివారం వాకాడులో పశువులకు టీకాలు వేశారు. మూడు నెలల వయస్సు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోరు, కాళ్లలో పుండ్లు ఏర్పడి నడవ డానికి, మేత మేయడానికి ఇబ్బందులు పడతామన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారికి నివాళి

సూళ్లూరుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేసి అశువులు బాసిన వారికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మహ దేవయ్య నగర్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు సారథి కుమార్, కే.నాగేశ్వరరావు, కయ్యరపు చంద్రబాబు, రాఘవయ్య, మాసారం చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో శనివారం ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గొల్లపల్లి సిసింద్రీ మాదిగ, మండల ఇన్‌చార్జి మందా వెంకటేశ్వర్లు, కిరణ కుమార్, కృష్ణయ్య, పెంచ లయ్య, సుబ్రహ్మణ్యం, కోటయ్య, నాగరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వాకాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొను గోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన వాకాడు మండలంలోని అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి కుంచం దయాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు వారాలుగా వరి పంట కోతలు మొదలయ్యా యని, రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు ధరలు తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు గగ్గోలు పడుతున్నా అధికారు లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే బస్తాకు రూ.150 నుంచి రూ.200 తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

కడివేడులో రీ సర్వేపై గ్రామసభ

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు గ్రామంలో శనివారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ కడివేడు గ్రామంలో సోమవారం నుంచి రీ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు తమ హక్కు పత్రాలను తీసుకువచ్చి భూములకు రీ సర్వే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో బాలాజీ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణకు చర్యలు

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడు తున్నట్లు ఈవోపీఆర్డీ సిరాజ్ తెలిపారు. శనివారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి తడి, పొడి చెత్తను సేకరణపై అవగాహన కల్పించారు. సంపద తయారీ కేంద్రాల్లో వసతులను మెరుగుపరిచి గ్రామాల్లోని తడి, పొడి చెత్తలను సేకరించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.





కానూరులో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం - బంగారంపేటలో పిల్లర్ల ప్రారంభంలోనే ఆగిన పనులు

సచివాలయ భవనాలకు మోక్షమెప్పుడో?

మంజూరు చేసినవి 13, పూర్తయినవి ఐదే ● అరకొర వసతులతో సిబ్బంది అవస్థలు

పెళ్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన గ్రామ సచివాలయాల శాశ్వత భవన నిర్మాణాలు పెళ్లకూరు మండలంలో అసంపూర్తిగా ఉన్నాయి. మండలానికి మొత్తం 13 సచివాల యాలు మంజూరు కాగా, పెళ్లకూరు, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, పాలచ్చూరు గ్రామాల్లో మాత్రమే భవనాలు పూర్తి చేశారు. తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామ సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేసినా కాంట్రాక్టర్లు అధికారులకు భవనాలు అప్పగించలేదు. మరో ఆరు భవనాలకు సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం పూర్తికాక వివిధ దశల్లో ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం మండలంలో 13 సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు రూ.5.66 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయానికి రూ.43.60 లక్షలతో రెండు అంతస్తుల భవనం నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. 13 భవనాలకు అప్పటి పాలకులు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పెళ్లకూరు, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, పాలచ్చూరు గ్రామాల్లోని భవనాలను పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పజెప్పారు. ఆయా భవనాల్లో అప్పటి నుంచి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇక కలవకూరు, పుల్లూరు గ్రామాల్లో రెండు అంతస్తుల వరకు శ్లాబువేసి వదిలేశారు. నెలబల్లి, చావాలిలో మొదటి అంతస్తు మాత్రమే నిర్మించారు. కానూరులో ఒక అంతస్తుకు శ్లాబువేసి వదిలేశారు. బంగారుపేటలో పిల్లర్లకు కమ్మీలు కట్టి బేస్‌మెంట్ కూడా నిర్మించకుండా వదిలేశారు. చిల్లకూరు, తాళ్వాయి



చిల్లకూరులో నిర్మాణం పూర్తయినా ప్రభుత్వానికి అప్పగించకుండా కాంట్రాక్టరు తాళాలు వేసిన భవనం

పాడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు భవనాలను ప్రభుత్వానికి అప్పగించలేదు. కొన్ని పంచాయతీల్లో ఇళ్లకు దూరంగా సచివాలయ భవన నిర్మాణాలను నిర్మించారు. వాటికి ప్రహరీ నిర్మించకపోవడంతో భద్రత కరువైంది. ఇక అసంపూర్తిగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళా తీసేలా చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెర వేరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. రోడ్ల అభివృద్ధి, చెరు వుల మరమ్మతులు తదితర అభివృద్ధిపనులకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు పరిచేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, వెంకటేశ్వర్లురెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, పట్టాభిరామిరెడ్డి, భారతి, ప్రమీల, పెంచలయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్: విజయశ్రీ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు సతీష్, మాధవనాయుడు, రాజసులోచనమ్మ

సూళ్లూరుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరి ష్కారమే ధ్యేయంగా ప్రతి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఎలిబేటి సతీష్, మాధవ నాయుడు, రాజసులోచనమ్మ, తడ మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి

నాయుడుపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డుకు అను బంధంగా సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీకి రైతులు వినతిపత్రం అందజేశారు. శనివారం సూళ్లూరుపేటలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యేని కలిసిన రైతులు తమ సమస్యలను వివరించారు. మండలంలోని పుదూరు, విన్నమాల, పెరికిలంపాటికండ్రిగ, మర్లపల్లి, కాపులూరు, చిలమత్తూరు, అన్నమేడు తదితర గ్రామాల వద్ద సాగరమాల రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయన్నారు. సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయకుండా 200 అడుగుల వెడల్పుతో సాగరమాల రోడ్డు నిర్మిస్తుండడంతో పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా పోతోందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్వీస్ రోడ్లు నిర్మించేలా చూడాలని విజయశ్రీకి రైతులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరిరనాథరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సునీల్, కిరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాల యంలో అంత ర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్క రించుకుని విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్ప డినా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషే కాలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంక రించి పల్లకీసేవ జరిపారు. ఆలయం ఆవరణలో స్వామి, అమ్మ వార్లను ఊరేగిం చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఓజిలిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ఓజిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాలయం వద్ద శనివారం ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినులను పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిను లకు ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో విజయ్‌కుమార్ దాతృత్వంతో విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మములాజాన్, కల్పన, రవి, నారాయణ, గిరి, నాను, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్

గూడూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభి వృద్ధి సాధించాలని లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందజేస్తూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సేవా సంస్థ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, శిక్షకరాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు సీఐటీయూ మద్దతు

పెళ్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక గ్రామంలో మూత పడిన వైష్ణవి డెయిరీ పరిశ్రమ ఎదుట కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు సీఐటీయూ నాయకులు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శివకవి, ముకుంద, గురవయ్య, మణి మాట్లాడుతూ 15 ఏళ్లుగా వైష్ణవి డెయిరీలో పనిచేస్తున్న కార్మికులకు చట్టపరమైన రాయితీలు ఇవ్వ కుండా గుట్టుచప్పుడు కాకుండా మూసి వేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీకాంత్, పుట్టయ్య, విజయభాస్కర్, బలరాం, జగదీశ్, గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దాతల అందజేసే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. శనివారం స్థానిక ఆర్వీఎం ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ నెల 17నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సుబ్రహ్మ ణ్యం, ఢిల్లీబాబు, రవీంద్ర, సుబ్బరావు, శ్రీహరి, సుంకర రవికుమార్, మురళి, వల్లభదాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో స్నానానికి వెళ్లి డ్రైవర్ మృతి



మృతి చెందిన దిలీప్ కుమార్ యాదవ్

తడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్నానానికి గుంతలో దిగిన డ్రైవర్ నీట మునిగి మృతి చెందిన ఘటన మాంబట్టు సెజ్‌లో జరిగింది. జార్ఖండ్ రాష్ట్రా నికి చెందిన దిలీప్ కుమార్ యాదవ్(32) లారీ డ్రైవర్. నాగాలాండ్ నుంచి మాంబట్టు సెజ్‌లోని ఓ పరిశ్రమలో లోడింగ్‌కు శుక్రవారం సాయంత్రం వచ్చాడు. పరిశ్రమకు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో లారీని ఆపి పక్కనే ఉన్న గుంతలో స్నానానికి వెళ్లాడు. ఈత రాక పోవడంతో నీటిలో మునిగిపోయి ఊపి రాడక మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కోట, మార్చి1(ఆంధ్రజ్యోతి): కోటలోని బీసీ బాలుర జూని యర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థులకు టీఎన్ ఎస్‌ఎఫ్ నాయకుల దాతృ త్వంతో సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షలకు అవసరమైన సామగ్రిని ప్రిన్సిపాల్ నారా యణరావుకు అందజేశారు. దాతలు వెంకటసుమన్, యశ్వంత్, అరవింద్, వినోద్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆడపిల్లలను ఎదగనిద్దాం

వెంకటగిరి టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను ఎదగనివ్వాలని సీఐ ఏవీ రమణ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ కార్య కర్తలు కల్పలత, మహిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పల్లె శుభ్రంగా ఉండాలి

డక్కిలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె శుభ్రంగా ఉండేలా చర్యలు తీ సుకొంటున్నట్లు ఈవోపీఆర్డీ అ ల్లాభక్షు అన్నారు. శనివారం డ క్కిలి ఎస్టీకాలనీలో క్లీన్ అండ్ గ్రీ న్ కార్యక్రమం చేపట్టారు. పొడి, తడి చెత్తగా వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. గ్రా మాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు మంచి నీటి ట్యాంకుల్లో క్లోరి నేషన్, దోమల నివారణకు ఫా గింగ్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్య క్రమంలో పంచాయతీ కార్యద ర్శి చైతన్య పాల్గొన్నారు.